స్కాన్ చేయండి

www.vaarthavedhikasurya.com

PRGI NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 2 | సంచిక: 96 | సోమవారం, 24 ఆగస్టు, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 8 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 2 | ISSUE : 96 | MONDAY, AUGUST 24, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 8 | RS : 5-00 |

## ప్రభుత్వ పాఠశాలల యూనిఫారాలపై హరీశ్‌రావు ధ్వజం



6 లో..

## ఆదిలాబాద్ ఐటీ టవర్‌తో ఐటీ విస్తరణకు మరో ముందడుగు: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 23 (వార్తా వేదిక సూర్య):



తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు ఐటీ రంగాన్ని విస్తరించాలన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పంలో భాగంగా ఆదిలాబాద్ ఐటీ టవర్ మరో ముందడుగని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదిలాబాద్ ఐటీ టవర్ నిర్మాణం పూర్తయిన మిగతా 2లో..

## నన్ను టార్గెట్ చేస్తున్నారు..

- అలాంటివారిపై చర్యలు తీసుకోవాలి
- మంత్రి కొండా సురేఖ ఆవేదన
- టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవికి లేఖ



హైదరాబాద్, ఆగస్టు 23 (వార్తా వేదిక సూర్య):

తనను, తన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని పలువురు కాంగ్రెస్ మిగతా 2లో..

## కష్టపడ్డ వారికే ప్రాధాన్యత

- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్



హైదరాబాద్, ఆగస్టు 23 (వార్తా వేదిక సూర్య):

కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పదవుల్లో సముచిత ప్రాధాన్యత కల్పిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మిగతా 2లో..





## వచ్చాక అన్ని విషయాలపై మాట్లాడతా

### రాజకీయ కోణంలోనే నా అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వలేదు

- అందుకే బోస్టన్‌కు వెళ్లలేకపోతున్నా.. • లండన్ పర్యటన విజయవంతమైంది.. • అన్ని అధికారిక సమావేశాలు, షెడ్యూల్ చేసిన కార్యక్రమాలన్నీ పూర్తి • ఖర్గేకు కృతజ్ఞతలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి • లండన్‌లో తెలుగు ప్రవాసులతోనూ ముఖ్యమంత్రి భేటీ

హైదరాబాద్ ప్రతినిధి, ఆగస్టు 23 (వార్త వేదిక సూర్య):

సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన అంశంలో ఊహించని పరిణామం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ముందుగా ఖరారైన షెడ్యూల్ ప్రకారం లండన్ పర్యటన ముగించుకొని, ముఖ్యమంత్రి అక్కడి నుంచి నేరుగా అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లాల్సి ఉంది. అయితే, కేంద్ర విదేశాంగ శాఖ ఆయన పర్యటనకు రాజకీయ అనుమతి నిరాకరించింది. విదేశాంగ శాఖ నిర్ణయంతో పర్యటన రద్దు చేసుకున్న సీఎం, అమెరికా వెళ్లకుండానే లండన్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు. ఈ మేరకు లండన్ నుంచే ఓ ప్రకటన విడుదల చేశారు. ''రాజకీయ కోణంలోనే తన అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదు.. కేంద్రం అనుమతి నిరాకరించిన నేపథ్యంలో బోస్టన్‌కు వెళ్లలేకపోతున్నా.. లండన్‌లో తాము చేపట్టిన పర్యటన అత్యంత విజయవంతమైంది.. అన్ని అధికారిక సమావేశాలు, షెడ్యూల్ చేసిన కార్యక్రమాలన్నీ పూర్తయ్యాయి'' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తనకు, తెలంగాణ ప్రభుత్వానికి అండగా నిలిచిన వివిధ రాజకీయ పార్టీల నేతలకు, దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. బోస్టన్ పర్యటన రద్దు కావడంతో కొన్ని గంటల్లోనే లండన్ నుంచి బయలుదేరి హైదరాబాద్ చేరుకోనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. మిగతా 2లో..





## చర్చలు సఫలం

- సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించిన ఆటో కార్మికులు • ఇవాళ్టి అర్ధరాత్రి నుంచి ఆటోలు బంద్ చేస్తామని ప్రకటించిన ఆటో సంఘాల జేఏసీ • మంత్రి పొన్నంతో ఆటో కార్మిక సంఘాల నేతల చర్చలు

హైదరాబాద్ ప్రతినిధి, ఆగస్టు 23 (వార్తా వేదిక సూర్య):





నేటి అర్ధరాత్రి నుంచి ఆటోలు బంద్ చేస్తామని తెలంగాణ ఆటో, యాప్ ఆధారిత సంఘాల జేఏసీ ప్రకటించింది. ఈ మేరకు రవాణా శాఖ మంత్రి ఆటో జేఏసీ నాయకుల తో చర్చలు జరిపారు. వారి డిమాండ్లను పరి ష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో తలపెట్ట దలచిన సమ్మెను విరమిస్తున్నట్లు ఆటో కార్మి కుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు ప్రకటించారు. ఈ మేరకు ఆటో కార్మికుల సంఘాల డిమాండ్ల పట్ల ప్రభు త్వం సానుకూలంగా ఉందని పొన్నం ప్రభా కర్ పేర్కొన్నారు. ఆర్టీసీ ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేయనుందన్న వార్తల్లో ఏమాత్రం వాస్తవం లేదని అవి కేవలం తప్పుడు ప్రచా రమని ఆయన స్పష్టం చేశారు. కార్మిక, రవా ణా, ఆటో కార్మికుల సంఘాల ప్రతినిధులతో సెప్టెంబర్ 1న సమావేశం నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. అలాగే ఆటో ఛార్జీల పెంపునకు వీలుగా ఉత్తర్వును జారీ చేయడానికి కూడా ప్రభుత్వం అంగీకరించిందని ఓలా, ఊబర్ తరహాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక యాప్‌ను రూపొందించాలని నిర్ణయించిందని ఆయన తెలిపారు.

### డిమాండ్లు ఇవే :

ఆర్టీసీ యాజమాన్యానికి ఈవీ ఆటోలను ఇవ్వాలనే ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలి.

ఆటో, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.

పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ ఛార్జీలు పెంచాలి.

ఓలా, ఊబర్, ర్యాపిడో యాప్‌లకు బదు లుగా ప్రభుత్వమే ఒక కొత్త యాప్‌ను తీసుకు రావాలి.

ఓలా, ఊబర్, ర్యాపిడో ద్వారా అక్రమం గా నడుస్తున్న టూవీలర్లను నిషేదించాలి.

ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేలు ఇవ్వాలి.

ఆటో డ్రైవర్లకు ఈ-ఛలాన్ల నుంచి మిన హాయింపు ఇవ్వాలి

హైదరాబాద్ నగరంలో అక్రమంగా న డుస్తున్న ఇతర జిల్లాల ఆటోలను నిషేధించాలి

వాహన సారథి పోర్టల్‌లో ఆటో డ్రైవింగ్ లైసెన్స్ కొనసాగించాలి

రవాణా వాహనాలకు రేడియం స్టిక్కర్స్ జి.ఓ.ఎం.ఎస్ నం.60లో ఆటోలకు మినహాయించాలి

## కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ తీవ్ర సంక్షోభం

- ఫీజు బకాయిలు చెల్లించే వరకు పోరాటం ఆగదు • గత ప్రభుత్వ హయాంలో రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలు • కాంగ్రెస్ వచ్చాక మరో రూ.4 వేల కోట్లు బకాయిలు • ఢిల్లీలో మీడియాతో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యావ్యవస్థ సంక్షోభంలోకి వెళ్లిందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.12 వేల కోట్లకు చేరడంతో సుమారు 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని అన్నారు. ఫీజు బకాయిలను ప్రభుత్వం పూర్తిగా చెల్లించే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో రామచందర్‌రావు మాట్లాడారు.

6 లో..





## శనిగరం, తంగలపల్లి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

- ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజా పాలన లక్ష్యం • ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు • ఆటో చార్జీల పెంపుపై ప్రత్యేక కమిటీ • ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు • ఎలక్ట్రిక్ ఆటోల కొనుగోలుకు రూ.1.50 లక్షల వరకు సాయం • ఆయిల్ పామ్ సాగుతో రైతులకు స్థిరమైన ఆదాయం • గ్రామాల అభివృద్ధికి దశలవారీగా పనులు • జల సంరక్షణకు ఇంకుడు గుంతలు • ప్లాస్టిక్ నియంత్రణకు స్టీల్ బ్యాంకులు • రైతులు, మహిళలు, యువతకు ప్రభుత్వం అండ

కోహెడ, ఆగస్టు 23 (వార్తా వేదిక సూర్య):

హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు చేపట్టిన 'పల్లె పల్లెకు పొన్నం అన్న–పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం, తంగలపల్లి గ్రామాల్లో మంత్రి పర్యటించారు. శనిగరంలో రూ.20 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభించి, వన మహోత్సవంలో మొక్కలు నాటారు. తంగలపల్లిలో రూ.43 లక్షల వ్యయంతో నిర్మించిన మిగతా 2లో..





## నల్లగొండను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### 2028 ఆగస్టు నాటికి ఎస్ఎల్‌బిసి సొరంగ పనులు పూర్తిచేయాలి

- గతంలో రూ.2 వేల కోట్లున్న అంచనా వ్యయం.. ప్రస్తుతం రూ.5 వేల కోట్లకు పెరిగింది • పనుల్లో ఇప్పటికే గణనీయమైన పురోగతి సాధించాం..
- ప్రతి ఎకరాకు సాగునీరందించాలనే లక్ష్యంతోనే ముందుకెళ్తున్నాం
- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

4 లో..

నల్లగొండ పట్టణాన్ని సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడంతో పాటు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన జీవిత లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ క్లబ్‌లో రూ.2 కోట్లతో నిర్మించిన అదనపు గదులు, సమావేశ మందిరాన్ని ఆయన ప్రారంభించారు. నల్లగొండ ప్రజలకు 24గంటల తాగునీరందించేందుకు రూ.125 కోట్లతో పనులు చేపట్టామని మంత్రి తెలిపారు. 6నెలల్లో పనులు పూర్తి చేసి నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్తి చేయడం తన ప్రధాన లక్ష్యమన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి:2 | సంచిక: 96
సోమవారం
24 ఆగస్టు, 2026

# అగ్నికి ఆహుతైన ఫర్నిచర్ గోదాంలు

**కార్వాన్, ఆగస్టు 23:** అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఫర్నిచర్ గోదాంలు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటన ఆదివారం ఉదయం గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కార్వాన్ మొగల్ కా నాలా రోడ్డులోని ఏకె ఫంక్షన్ హాల్ వెనుక వైపు పెద్ద ఎత్తున ఫర్నిచర్ గోదాంలు ఉన్నాయి. ఇదే వరుసలో కొన్ని ఇతర వస్తువుల గోదాంలు కూడా ఉన్నాయి. ఇదిలా ఉండగా ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో గోదాంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో మూడు ఫర్నిచర్ గోదాంలతో పాటు వీటి పక్కనే ఉన్న డైపర్‌లు నిల్వ చేసి ఉంచిన గోదాం కూడా పూర్తిగా కాలిపోయింది. అదృష్టవశాత్తు ఎవరూ లేకపోవడంతో కేవలం ఆస్తి నష్టం జరిగింది. ఈ అగ్ని ప్రమాదంలో గోదాంలలో నిల్వ ఉన్న ఫర్నిచర్‌తో పాటు వాటి కోసం ఉపయోగించే ముడి సరుకు, రవాణా కోసం ఉపయోగించే రెండు ఆటో ట్రాలీలు, రెండు ద్విచక్ర వాహనాలు, మరో ట్రాన్స్‌పోర్ట్ వాహనం కూడా కాలిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని 5 ఫైరింజన్లతో మంటలు ఆర్పివేశారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ ఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపారు.



# అల్పపీడనం ఎఫెక్ట్.. నగరంలో భారీ వర్షం


**హైదరాబాద్, ఆగస్టు 23 (వార్త వేదిక సూర్య):**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆదివారం గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మల్కాజిగిరిలోని వినాయక్‌నగర్‌లో అత్యధికంగా 5.20సెం.మీలు, అమీన్‌పూర్‌లోని కిస్టారెడ్డిపేటలో 2.38 సెం.మీలు, కీసరలో 2.15 , శంషాబాద్ విమానాశ్రయం ప్రాంతంలో 1.88, కొంగరకలాన్‌లో 1.65, సుల్తాన్‌పూర్, పటాన్‌చెరులో 1.60, ఆర్‌సీ పురంలో 1.58 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. అల్పపీడనం ప్రభావంతో మరో రెండు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 27.9 డిగ్రీలు, కనిష్ఠం 23.0డిగ్రీలు, గాలిలో తేమ 96శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

# చిన్నారెడ్డి ఇచ్చిన వివరణలో అన్ని అబద్ధాలే కాంగ్రెస్ ఎమ్మెల్యే మేఘారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 23 (వార్త వేదిక సూర్య):**

కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుల అసంతృప్తి పర్వం కొనసాగుతున్న విషయం తెలిసిందే. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి డబ్బులు ఇచ్చి టికెట్ కొనుక్కున్నాడంటూ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిన్నారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేయగా.. సోనియా గాంధీ నాకు టికెట్ ఇచ్చి, డబ్బులు లేకపోతే మీరే ఖర్చు పెట్టుకుని గెలిపించాలని రేవంత్ రెడ్డికి చెప్పింది. కానీ డబ్బులకు ఆశపడి మేఘారెడ్డి వద్ద డబ్బులు తీసుకుని రేవంత్ రెడ్డి అతనికే టికెట్ ఇచ్చాడంటూ చేసిన ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. అయితే ఈ పంచాయతీపై ఢిల్లీకి.. అటు నుంచి గాంధీభవన్‌కు చేరగా చిన్నారెడ్డి ఎమ్మెల్యే మేఘారెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై క్రమశిక్షణ కమిటీ వైస్ చైర్మన్ శ్యామ్‌మోహన్‌కు వివరణ కూడా ఇచ్చారు. తాజాగా వనపర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేఘారెడ్డి చేసిన కామెంట్స్ హాట్ టాపిక్‌గా మారాయి. చిన్నారెడ్డి ఇచ్చిన వివరణలో అన్ని అబద్ధాలే ఉన్నాయని మేఘారెడ్డి అన్నారు. చిన్నారెడ్డి ఇచ్చిన వివరణకు నేను సంతృప్తి చెందలేదు. చిన్నారెడ్డిపై చర్యలు తీసుకోవాల్సిందే. క్రమశిక్షణ కమిటీ మళ్లీ పిలిస్తే నా వాదన వినిపిస్తానన్నారు.



# వచ్చాక అన్ని విషయాలపై మాట్లాడతా

(మొదటి పేజీ తరువాయి)

భాగ్యనగరానికి చేరు కున్న వెంటనే విదేశాంగ శాఖ నిర్ణయం, దాని కి వెనుక ఉన్న రాజకీయం, పర్యటన వివరాల కు సంబంధించిన అన్ని అంశాలపై పూర్తి స మాచారం వెల్లడిస్తానని రేవంత్ రెడ్డి తెలిపారు.

**లండన్‌లో తెలుగు ప్రవాసులతో భేటీ**

ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిం చతలపెట్టిన తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయాలని లండ న్‌లో తెలుగు ప్రవాసులకి ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదివారం ఉదయం లండన్‌లోని తెలు గు ప్రవాసులతో సమావేశమయ్యారు. ఈ సం దర్భంగా తెలంగాణ అభివృద్ధి, భవిష్యత్ ప్రగ తిపై ప్రవాసులతో వారు చర్చించారు. తెలుగు సమాజం ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు ఆత్మీయంగా ముచ్చటిం చారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాసు లు కూడా భాగస్వాములు కావాలని స్పష్టం చే శారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచ వ్యాప్తంగా బలంగా ప్రచారం చేస్తూ, రాష్ట్రానికి మంచి రాయబారులుగా నిలవాలని కోరారు.

**ఖర్గేకు కృతజ్ఞతలు..**

గత మూడు రోజులుగా లండన్‌లో తమ కు లభించిన అపూర్వ మద్దతుకు అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు అని సీఎం తన ట్వీట్‌లో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణ యాన్ని కాంగ్రెస్ జాతీయ నాయకత్వం తీవ్రం గా ఖండించిందన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ వ్యవహారంపై స్పందిస్తూ, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం ప్రవర్తిస్తోందని, ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను ఇలా అడ్డుకోవడం దారుణమంటూ తనకు మద్దతుగా నిలిచారన్నారు. తనకు కొండంత అండగా నిలిచిన పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కష్టపడ్డ వారికే ప్రాధాన్యత

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శ న్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, డీసీసీ అధ్యక్షు లు నగేష్‌రెడ్డి, బొబ్బిలి రామకృష్ణ, కార్పొరేషన్ చైర్మన్లు, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, సునీల్‌కుమార్‌రెడ్డి, విపుల్‌గౌడ్, ఫ్రంటల్ ఆర్గనైజే షన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. క్రింది స్థాయిలో పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు కూడా పదవులు ఇవ్వాలనే డిమాండ్ వస్తోందని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. పదవుల భర్తీలో అన్ని వర్గాలకు సమతుల్యత పాటిస్తామని చెప్పారు. పార్టీ కోసం గత ఐదేళ్లుగా నిరంతరం కష్టపడిన వారికి పదవుల్లో అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. పార్టీ పదవుల్లో 70 శాతం పాత కార్యకర్తలకే ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పార్టీ ఇన్‌చార్జితో కలిసి నిర్ణయం తీసుకున్నామని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఏఐసీసీ స్థాయిలోనూ ఇదే విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు. ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్‌తో పాటు పార్టీని అంటిపెట్టుకుని పనిచేస్తున్న కార్యకర్తలకు తొలి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. అన్ని పార్టీ కమిటీలను భర్తీ చేస్తామని, ఇందులో 20 శాతం కొత్త వారికి అవకాశం కల్పిస్తామని మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. మార్కెట్ కమిటీలకు సంబంధించి అనుమతులు ఇవ్వాలని మంత్రి సీతక్క సూచించినట్లు తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను తప్పకుండా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. 'అధికారం కార్యకర్తల కృషి వల్లే వచ్చింది. కార్యకర్తల కష్టాన్ని కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ మరచిపోదు' అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పీసీసీ అధ్యక్షుడిగా తన 35 ఏళ్ల ఇంజనీరింగ్ కళాశాల, వ్యవసాయ కళాశాల కల సాకారం అయిందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లతో తిరిగి అధికారంలోకి వస్తుందని మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

# బంగ్లాదేశ్‌లో రిటైర్డ్ హిందూ టీచర్ కుటుంబం అనుమానాస్పద మృతి

**బంగ్లాదేశ్:** బంగ్లాదేశ్‌లో ఒక హిందూ కుటుంబం అనుమానాస్పదంగా మరణించింది. ఈ ఘటనతో స్థానిక హిందువులు మరోసారి ఉలిక్కి పడ్డారు. మృతుల్లో ఒక రిటైర్డ్ టీచర్, అతడి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటన బంగ్లాదేశ్, రంగ్‌పూర్ మెట్రోపాలిటన్ కొత్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి స్థానిక మీడియా, బంధువులు తెలిపిన వివరాలివి. గణపతి చక్రవర్తి (65) అనే వ్యక్తి రంగ్‌పూర్ జిల్లా స్కూల్ టీచర్‌గా పని చేసి, గత ఏడాది డిసెంబర్ 31న రిటైర్ అయ్యారు. ఆయన ఇటీవలే సొంత ఇల్లు నిర్మించుకుని, భార్య ప్రీతిలతా చక్రవర్తి (50), కూతురు అగామి చక్రవర్తి ప్రార్థి (23), కొడుకు ప్రియం చక్రవర్తి (12)తో కలిసి ఉంటున్నాడు. పిల్లల్లో అగామి ఇటీవలే ఇంగ్లీష్‌లో మాస్టర్స్ పూర్తి చేయగా, కొడుకు ఐదో తరగతి చదువుతున్నాడు. వీరి కుటుంబానికి స్థానికులతో, ఎవరితో ఎలాంటి విభేధాలు లేవు. అనుమానించదగ్గ శత్రువులు కూడా లేరు. గణపతి చక్రవర్తి కుటుంబంతో బంధువులు చివరగా గత గురువారం ఫోన్‌లో మాట్లాడారు. ఆ తర్వాత నుంచి ఆ కుటుంబంలోని నలుగురి ఫోన్లు స్విచ్ఛాఫ్ వచ్చాయి. దీంతో చాలాసార్లు ఫోన్ చేసి నా.. ఎవరూ స్పందించలేదు. చివరకు శనివారం సాయంత్రం ప్రీతిలత సోదరి వారి ఇంటికి వచ్చింది. అప్పటికి ఇల్లు పూర్తిగా లాక్ చేసి ఉంది. గేట్లు వేసి ఉన్నాయి. ఇంటి లోపల నుంచి తలుపులు గొల్లెం పెట్టుకుని ఉన్నారు. దీంతో ఆమె పోలీసులకు సమాచారం అందించింది. వారు వచ్చి తలుపులు బద్దలుకొట్టి చూడగా.. ఇంట్లో నలుగురు మరణించి ఉన్నారు. పైకప్పు మీద గణపతి, మెట్లమీద ప్రీతిలత, అగామి మరణించి ఉండగా, కొడుకు ప్రియం మృతదేహం బెడ్‌పై పడి ఉంది. దీంతో గణపతి బంధువులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. వారి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాల్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం తరలించారు. ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరించారు. వారి మరణానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇది హత్యా, ఆత్మహత్యా అనే కోణంలో విచారిస్తున్నారు. తమ వారిది హత్యే అని, నిందితులపై చర్యలు తీసుకోవాలని గణపతి బంధువులు కోరుతున్నారు. అయితే, ఈ ఘటనతో స్థానిక హిందువుల్లో మరోసారి కలకలం రేగింది.

# శనిగరం, తంగలపల్లి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)




అంతర్గత సీసీ రోడ్లను ప్రారంభించారు. రెండు గ్రామాల్లో ప్రజల సమక్షంలో అధికారులతో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రజలు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధుల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించడమే ప్రజా పాలన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి శాఖ అధికారులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వహించి ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. శనిగరం గ్రామంలో 46 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, రెండో దశలో మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. 366 కుటుంబాలకు మహాలక్ష్మి పథకం కింద రూ.1.21 లక్షల గ్యాస్ సబ్సిడీ, 997 కుటుంబాలకు గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కోసం రూ.22.41 లక్షల ప్రయోజనం అందిందన్నారు. 719 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.1.57 కోట్లు, 648 మంది రైతులకు రూ.4.54 కోట్ల రుణమాఫీ, 17 మంది రైతు కుటుంబాలకు రైతు బీమా కింద రూ.85 లక్షలు అందాయని తెలిపారు. గ్రామంలో 829 పింఛన్లకు నెలకు రూ.18.91 లక్షలు విడుదలవుతున్నాయని చెప్పారు. కొత్తగా 443 రేషన్ కార్డులు పంపిణీ చేయడంతో పాటు 327 యూనిట్లు అదనంగా చేర్చినట్లు తెలిపారు. తంగలపల్లి గ్రామంలో 26 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, 671 కుటుంబాలకు గృహజ్యోతి కింద రూ.22.41 లక్షల ప్రయోజనం, 1,121 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.1.57 కోట్లు, 472 మంది రైతులకు రూ.3.73 కోట్ల రుణమాఫీ, తొమ్మిది రైతు కుటుంబాలకు రైతు బీమా కింద రూ.45 లక్షలు అందాయని మంత్రి వివరించారు. గ్రామంలో 503 పింఛన్లకు నెలకు రూ.11.29 లక్షలు విడుదలవుతున్నాయని తెలిపారు. శనిగరం–తంగలపల్లి మీదుగా సుదరగిరి వరకు రూ.18 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. శనిగరం గ్రామంలో మరో 2 వేల మీటర్ల సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరు, శనిగరం ప్రాజెక్టు ద్వారా సాగునీరు, గంగమ్మ కాలువ, బెజ్జంకి కాలువల సీసీ పనులు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సమస్యల పరిష్కారం వంటి అంశాలపై మంత్రి దృష్టికి వచ్చిన వినతులను పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడతామని హామీ ఇచ్చారు. తంగలపల్లిలో పిల్లివాగుపై బ్రిడ్జి, చెక్‌డ్యామ్, కాలువ విస్తరణ, దుర్గమ్మ, బతుకమ్మ ప్రదేశాలకు సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని పిల్లివాగుపై వంతెన నిర్మాణానికి రూ.17 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించామని, త్వరలో మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. రైతులు వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలని పొన్నం ప్రభాకర్ సూచించారు. ఆయిల్‌పామ్ సాగుతో దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఎకరాకు 57 మొక్కలు, మొదటి మూడు సంవత్సరాల వరకు సబ్సిడీ, అంతర పంటల సాగుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఎకరాకు సంవత్సరానికి సుమారు రూ.1.50 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. కోహెడ మండలంలో ఇప్పటికే 1,320 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని, సుమారు 900 మెట్రిక్ టన్నుల గెలలు సేకరించామని తెలిపారు. నర్మేట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి పంట తరలింపు రవాణా ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. జలసిరి పథకం కింద ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, ఇందుకోసం ప్రభుత్వం రూ.6,500 ఆర్థిక సహాయం అందిస్తుందని మంత్రి తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు శనిగరంలో 1,600 స్టీల్ బ్యాంక్ కిట్లు అందించామని చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని 173 గ్రామాల్లో 289 సంఘాలకు స్టీల్ బ్యాంకులు, 540 హోటళ్లకు స్టీల్ గ్లాసులు అందించినట్లు వివరించారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, శిక్షణ, ఇతర అవకాశాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. శనిగరం ధాన్యం సేకరణ కేంద్రంగా ఉన్నందున సుమారు 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించే సామర్థ్యానికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. 14–15 ఏళ్ల బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ టీకాలపై అవగాహన కల్పించి టీకాలు వేయించాలని సూచించారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేలా స్పోర్ట్స్ కిట్లు అందించామని, హుస్నాబాద్‌లో కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ నెల 31 వరకు పెన్షన్ల దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతున్నందున అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆటో కార్మికులు చేపట్టనున్న సమ్మెను విరమించి ప్రభుత్వంతో చర్చలకు రావాలని కోరారు. 2015 తర్వాత ఆటో చార్జీలు పెరగలేదని, పెట్రోల్, డీజిల్ ధరలు, వాహనాల ధరలు, నిర్వహణ ఖర్చులను పరిగణనలోకి తీసుకుని చార్జీల పెంపుపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కమిటీలో ఆటో కార్మికుల ప్రతినిధులు, రవాణా శాఖ అధికారులు, సంబంధిత వర్గాలను భాగస్వామ్యం చేసి న్యాయమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కేబినెట్ నిర్ణయం తీసుకుందని, అవసరమైన విధివిధానాలు రూపొందించి బోర్డును ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు.

పెట్రోల్, డీజిల్, గ్యాస్ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చుకునే రెట్రోఫిట్మెంట్‌కు ఒక్కో ఆటోకు రూ.1.50 లక్షల వరకు ప్రభుత్వ సహాయం అందించే కొత్త పథకాన్ని తీసుకొస్తున్నామని చెప్పారు. పాత ఆటోను స్క్రాప్ చేసి కొత్త ఎలక్ట్రిక్ ఆటో కొనుగోలు చేసుకునే వారికి కూడా ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ఆటో కార్మికుల సమస్యలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని, అర్హులైన ఆటో కార్మికుల కుటుంబాలకు రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం తదితర సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించిన విధంగానే ఆటో కార్మికుల న్యాయమైన సమస్యలను కూడా చర్చల ద్వారా పరిష్కరిస్తామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. సమ్మెతో సమస్యలు పరిష్కారం కావని, ప్రభుత్వం చర్చలకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, సర్పంచులు లింగంపల్లి లక్ష్మయ్య, బోయిని సంపత్, జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ఆటో కార్మికుల ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నన్ను టార్గెట్ చేస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు అవమానకర రీతిలో వ్యాఖ్యలు చేస్తున్నారని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ ల మంత్రి కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహా రం వెనుక ఉండి నడిపిస్తున్న అసలు వ్యక్తులను నిష్పాక్షికంగా గుర్తించి, వారిపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల ని టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవిని కోరుతూ ఆమె లేఖ రాశారు. టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ తనకు జారీ చేసిన నోటీసుకు ఇప్పటికే వివరణ సమర్పించినప్పటికీ, తన పై, తన కుటుంబ సభ్యులపై బహిరంగంగా విమర్శలు కొనసా గుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. క్రమశిక్షణా కమిటీ విచా రణ కొనసాగుతున్న సమయంలోనే తన రాజకీయ భవిష్య త్తుపై తీర్పులు ఇవ్వడం, తనపై చర్యలు తీసుకోవాలని మీడి యా ముందు డిమాండ్ చేయడం ద్వారా కమిటీ స్వతంత్ర నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నం జరిగిందా అనే అంశా న్ని కూడా పరిశీలించాలని కోరారు. పార్టీ క్రమశిక్షణపై తనకు పూర్తి గౌరవం ఉందని, అదే సమయంలో సీనియర్ బీసీ మహిళా నాయకురాలిగా తనపై తీవ్ర వ్యాఖ్యలతో సామూహిక దాడులు జరుగుతున్నప్పుడు పార్టీ నాయకత్వం మౌనం వహిం చడం ఆందోళన కలిగిస్తోందని కొండా సురేఖ పేర్కొన్నారు. తన రాజకీయ భవిష్యత్తుపై తీర్పులు ఇస్తూ, చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేస్తూ కొందరు మీడియా ముందుకు రావ డం వెనుక ఉన్న ఉద్దేశాలను కూడా పార్టీ నాయకత్వం పరిశీ లించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, మహిళా సాధికారత, బలహీన వర్గాల ఆత్మగౌరవానికి కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ విలువలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై పార్టీ క్రమశిక్షణా నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. తనను, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని వ్యా ఖ్యలు చేస్తున్న వారి వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి, వాస్తవా లను నిష్పాక్షికంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని మల్లు రవికి విజ్ఞప్తి చేశారు.

# ఆదిలాబాద్ ఐటీ టవర్‌తో ఐటీ విస్తరణకు మరో ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో హైదరాబాద్‌కు సుమారు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆదిలాబాద్‌లోనూ ఐటీ పరిశ్రమ విస్తరించేందుకు అవకాశాలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. త్వరలో ప్రారంభం కానున్న ఆదిలాబాద్ ఐటీ టవర్ ద్వారా ఆదిలాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల యువతకు స్థానికంగానే ఉద్యోగావకాశాలు లభించాలని కేటీఆర్ ఆకాంక్షించారు. యువత ఉపాధి కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే ఐటీ ఉద్యోగాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. తెలంగాణలోని ద్వితీయ శ్రేణి నగరాలకు ఐటీ కంపెనీలను తీసుకెళ్లాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐటీ టవర్ల నిర్మాణాలను చేపట్టామని కేటీఆర్ తెలిపారు. అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించి ప్రముఖ ఐటీ కంపెనీలను ఆకర్షించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే వరంగల్, సిద్దిపేట, సూర్యాపేట, నల్లగొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం, కరీంనగర్ నగరాల్లో ఐటీ టవర్లు ప్రారంభమయ్యాయని కేటీఆర్ గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం ఆయా ఐటీ టవర్ల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయని ఆయన అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఐటీ టవర్లలో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర వసతులు కల్పించాలని కోరారు. మరిన్ని ఐటీ కంపెనీలను ద్వితీయ శ్రేణి నగరాలకు ఆకర్షించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ ఐటీ టవర్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణలో ఐటీ రంగ విస్తరణకు మరింత ఊతం లభించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

# నేడు కాంగ్రెస్ అత్యవసర సమావేశం

**సాయంత్రం 5.30 గంటలకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీనటరాజన్ నేతృత్వంలో సమావేశం**

**హైదరాబాద్, ఆగస్టు 23 (వార్త వేదిక సూర్య):**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వంలో చోటుచేసుకొంటున్న తాజా పరిణామాల నేపథ్యంలో సోమవారం టీపీసీసీ అత్యవసర సమావేశం ఏర్పాటుచేసింది. సాయంత్రం 5.30 గంటలకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీనటరాజన్ నేతృత్వంలో సమావేశం జరుగుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి.స్థానిక నగర గైడ్‌లను పరిశీలించడం, మంత్రులు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, 'సర్' కో–ఆర్డినేటర్లతో అత్యవసర జూమ్ సమావేశం ఏర్పాటు చేసినట్లు వెల్లడించాయి. కానీ, పార్టీ నేతల విభేదాలపై అభిప్రాయాలు తెలుసుకోనున్నట్లు ప్రచారం జరుగుతున్నది.

# ఆరోగ్యశ్రీని దెబ్బతీస్తున్న కాంగ్రెస్ సర్కార్

**రూ. 1,400 కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలి**

**మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం**

**హైదరాబాద్, ఆగస్టు 23 (వార్త వేదిక సూర్య):**

ఉచిత వైద్యంతో ఎన్నో పేద, మధ్యతరగతి కుటుంబాలకు కొండంత అండగా నిలిచిన ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రస్తుత ప్రభు త్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశా రు. కోకాపేటలోని ఆ యన స్వగృహంలో ఆరోగ్యశ్రీ ఉద్యోగులు, సిబ్బంది ఆదివారం కలిసి తమ గోడు చె ప్పుకొన్నారు. జీతాలు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నామని తమ దీనస్థితిని ఆయనకు తెలియజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందించిన దవాఖానలకు పెండింగ్‌లో ఉన్న రూ.1,400 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఆరోగ్యశ్రీ సిబ్బంది జీతాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.



# రంగారెడ్డి




## ఆపదలో ఆదుకునే ఉపాధ్యాయుడు షేక్ అల్లావలి

రాజేంద్రనగర్, ఆగస్టు 23 ( వార్త వేదిక సూర్య ) :



బోధనను వృత్తిగా, రక్తదానాన్ని ప్రవృత్తిగా చేసుకుని ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్నారు ప్రభుత్వ ఉపాధ్యాయుడు షేక్ అల్లావలి. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలోని ఎం.పీ.పీ.ఎస్. శ్రీరాం నగర్ పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఆయన విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను బోధిస్తున్నారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 2న గాంధీ జయంతి, జూన్ 14న ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్తదానం చేయడం ఆయనకు అలవాటుగా మారింది. ఇందులో భాగంగా ఆదివారం మొయినాబాద్‌లోని చిరిగే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మీలాద్ రక్తదాన శిబిరంలో మరోసారి రక్తదానం చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ చేతుల మీదుగా రక్తదాన ధ్రువీకరణ పత్రాన్ని అందు కున్నారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్న షేక్ అల్లావలిని పలువురు అభినందించారు.

## శ్రేష్ఠం గేట్‌వే హోటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్


రాజేంద్రనగర్, ఆగస్టు 23 ( వార్త వేదిక సూర్య ) :



శంషాబాద్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రేష్ఠం గేట్‌వే హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. హోటల్ నిర్వాహకులు సంకూరి జై ప్రకాష్ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై తన చేతుల మీదుగా హోటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, శ్రేష్ఠం గేట్‌వే హోటల్ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ మంచి పేరు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. హోటల్ నిర్వాహకులు సంకూరి జై ప్రకాష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంకూరి జై ప్రకాష్ కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, నాయకులు, తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## పెరిక కుల ఆత్మగౌరవ భవనానికి అంకతి దంపతుల భారీ విరాళం

సికింద్రాబాద్, ఆగస్టు 23(వార్త వేదిక సూర్య)



కోకాపేటలో నిర్మిస్తున్న పెరిక కుల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి అంకతి అశోక్ కుమార్--శృతి దంపతులు రూ.2 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఇందులో భాగంగా మొదటి విడతగా రూ.1 లక్ష చెక్కును రాష్ట్ర పెరిక సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ దొంగరి మనోహర్, అసోసియేట్ అధ్యక్షులు సుంకరి ఆనంద్‌లకు అందజేశారు. నల్లగొండ జిల్లా ఇండ్ల కోటయ్యగూడెం గ్రామానికి చెందిన అంకతి కృష్ణయ్య--వీరమ్మల కుమారుడు అంకతి అశోక్ కుమార్ ప్రస్తుతం ఉద్యోగరీత్యా హైదరాబాద్ పెద్ద అంబర్‌పేటలో స్థిరపడ్డారు. పెరిక కులంపై తనకున్న అభిమానాన్ని చాటుకుంటూ ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రూ.2 లక్షల విరాళాన్ని ప్రకటించారు. భవిష్యత్‌లో మిగిలిన మొత్తాన్ని కూడా అందజేస్తామని దంపతులు తెలిపారు. ఈ విరాళం అందజేత కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ పెరిక కుల సంఘం అధ్యక్షులు డా. బొలిశెట్టి సతీష్, రంగారెడ్డి జిల్లా పెరిక కుల సంఘం అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు(ఆర్.వి) తదితరులు పాల్గొన్నారు.

# రూపరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన డా.ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్



దేవరకొండ ఆగస్టు 23 ( వార్త వేదిక సూర్య)

ఇటీవల మృతి చెందిన కొండమల్లేపల్లి నాగార్జున స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపల్ రూప రెడ్డి కుటుంబ సభ్యులను ఈరోజు హైదరాబాద్, గుర్రంగూడ లోని నివాసాంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పరామర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ హత్యకు గల కారణాలను తెలుసుకున్నారు అనంతరం ఆర్ఎస్పి మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో శాంతి భద్రతలలు ఎంత దారుణంగా దిగజారాయో అని ఇలాంటి సంఘటనను చూస్తే అర్థమవుతుంది విద్యార్థులను మంచి మార్గంలో నడిపించడానికి ప్రతి స్కూల్లో ఒక కౌన్సిలర్ నియమించాలని అదేవిధంగా తల్లిదండ్రులకు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, విద్యార్థుల నడవడికను గమనిస్తూ ఎప్పటికప్పుడు వారి ప్రవర్తన మీద దృష్టి పెట్టాలని సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరు కూడా ఇలాంటి వాటికి తావునీవకుండ భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.

అనంతరం రూపరెడ్డి చిత్రపటానికి నివాళ్లు అర్పించారు.వారి వెంట బిఆర్ఎస్ నాయకులు రామావత్ రమేష్ నాయక్, నాయిని



శ్రావణ్ రెడ్డి, చనగొని శివ గౌడ్, తుర్కయంజాల్ కౌన్సిలర్ రామావత్ కళ్యాణ్ నాయక్, బండ రావిరాల్ల సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్, అనాజ్ పూర్ సర్పంచ్ ముదిగొండ మొగులయ్య, కేశవులుఅందొజు శంకరాచారి,మల్లారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ భాస్కర్,గంటేల ఆంజనేయులు,గండు నాగేంద్రబాబు, ముదిగొండ వెంకట్,అశోక్ నాయక్,శ్రీను, శివ,అడ్వకేట్ మాతంగి సురేష్, పల్లె అనిల్ తదితరులు పాల్గొన్నారు

# ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



## ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 12వేలు ఇవ్వాలి
## సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య

నాంపల్లి ఆగస్టు 23(వార్త వేదిక సూర్య)

నల్గొండ జిల్లా నాంపల్లి మండలం తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న ఆటో డ్రైవర్ తో పాటు రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




ఆదివారం నాంపల్లి మండల కేంద్రంలో ఆటో డ్రైవర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య జిల్లా కమిటీ సభ్యులు ఏదుళ్ళ సునీత హాజరైన వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో చదువుకొని ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక అప్పులు సభ్యులు చేసుకుని ఆటో కొనుక్కొని నడుపుతున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు ద్వారా ప్రమాద బీమా ఆరోగ్య బీమా పిల్లలకు స్కాలర్షిప్స్ పెన్షన్ లాంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి స్కీం లో భాగంగా ఆటో డ్రైవర్ల ఉపాధి కోల్పోవడంతో సంవత్సరానికి 12 వేలు జీవన భృతి ఇస్తానన్న హామీని వెంటనే నిలబెట్టుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 2019 మోటార్ వాహన చట్టం కార్మికుల మెడమీద ఉరితాడు లాగా మారిందని విమర్శించారు. డీజిల్ పెట్రోల్ ధరలు స్పేర్ పార్ట్స్ ధరలు పెరగడంతో ఆటో కార్మికుల బతుకులు అగమ్యకువచ్చినంగా మారుతున్నాయని వీరి నాదుకోవడం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆటో రంగ కార్మికుల పొట్టలు కొట్టే విధంగా ఎలక్ట్రానిక్ ఆటోలను ప్రవేశపెట్టి గమ్యానికి చేర్చే పద్ధతిని మానుకోవాలని ఓలా ఉబర్ లాంటి గుత సంస్థలను నిషేదించాలని కోరారు. ఈనెల 24 నుండి జరిగే ఆటోల రాష్ట్ర వ్యాప్త బందులో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకురాలు ఎదుళ్ళ సునీత ఆటో యూనియన్ నాయకులు ఆవుల వెంకటయ్య బుష్పాక వెంకటేశ్వర్లు నారపాక విజయ్ పగడాల అంజయ్య బైరగోని అంజయ్య తదితరులు పాల్గొన్నారు



## వద్య్త తుల్ఛ్యా నాయక్ మృతి బాధాకరం
### బీ .ఆర్.ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్

దేవరకొండ ఆగస్టు 23 (వార్తా వేదిక సూర్య):-

డిండి మండలం లోని సింగరాజు పల్లి గ్రామం సింగరాజు పల్లి తండా కి చెందిన వద్య్త తుల్ఛ్యా నాయక్ మృతి చాలా బాధాకరం అని బీ ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్ అన్నారు. తుల్ఛ్యా నాయక్ మృత దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు

ఆయన వెంట వద్య్త లాలూ నాయక్, వద్య్త శ్రీను సర్పంచ్ లక్ష్మి పతి , సర్పంచ్ కిషన్ నాయక్ , కేతావత్ హరిలాల్ నాయక్ ,సైదులు గోరంట్ల, జంగయ్య , లాల్ సింగ్ , మాజీ ఉప సర్పంచ్ ధనలక్ష్మి , నర్యా నాయక్, రాజు నాయక్ , నేనావత్ నాగార్జున లక్ పతి తదితరులు ఉన్నారు

## సబావత్ బొడ్డు మృతి బాధాకరం
### - దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్


దేవరకొండ ఆగస్టు 23 (వార్తా వేదిక సూర్య):-



చందంపేట మండలం వెంకట్ నాయక్ తండాకు చెందిన సబావత్ బొడ్డు మృతి బాధాకరమని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.ఆదివారం వెంకట్ నాయక్ తండాలో సబావత్ బొడ్డు కుటుంబ సభ్యులను రమావత్ రవీంద్ర కుమార్ పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. బొడ్డు మృతి కుటుంబ సభ్యులకు,బంధుమిత్రులకు తీరని లోటని అన్నారు.బొడ్డు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు రమావత్ మోహన్ కృష్ణ, కేతావత్ శంకర్ నాయక్, వడత్య బాలు, రమావత్ శోభన్, నాగిల్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ ఆగస్టు 23 (వార్తా వేదిక సూర్య):-



పెరికేటి శ్రీనివాస చారి కుమార్తె పెరికేటి మౌనిక--అభిలాష్ వివాహ వేడుకల్లో దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారు సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన వధూవరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, కౌన్సిలర్ పొట్ట మురళి, సర్పంచ్ రమావత్ తులసిరామ్, రామావత్ ఉమెందర్ కుమార్, రమావత్ శ్రీను,బొడ్డుపల్లి కృష్ణ ,వడత్య బాలు, వాజిద్ పాషా,ముదిగొండ హరిదాస్, బొడ్డుపల్లి సైదులు, పరిపూర్ణ చారి,బిఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

# ప్రతి ఒక్కరూ మహాలక్ష్మమ్మ తల్లి అనుగ్రహం పొందాలి

## -- దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ మార్చి 23 (వార్తా వేదిక సూర్య):-

ప్రతి ఒక్కరూ మహాలక్ష్మమ్మ తల్లి అనుగ్రహం పొందాలని దేవరకొండ మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ ఇంచార్జి రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. ఆదివారం చందంపేట మండలం గువ్వలగుట్ట గ్రామంలో నిర్వహించిన మహాలక్ష్మమ్మ పండుగ సందర్భంగా రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో జీవించాలని ఆకాంక్షించారు.ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో పండుగను నిర్వహించుకోవడం అభినందనీయమని అన్నారు.గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరి కుటుంబాల్లో సుఖశాంతులు నెలకొనాలని మహాలక్ష్మమ్మ తల్లిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముత్యాల సర్వయ్య,రమావత్ మోహన్ కృష్ణ, కేతావత్ శంకర్ నాయక్,రమావత్ రాజా, రమావత్ బాలు, వడత్య బాలు,పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు



వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2
సంచిక : 96
సోమవారం
24 ఆగస్టు 2026

# నల్లగొండను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

## రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి




నల్లగొండ బ్యూరో, ఆగస్టు 23 (వార్తా వేదిక సూర్య )


నల్లగొండ పట్టణాన్ని సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడంతో పాటు, నల్లగొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన జీవిత లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని నల్లగొండ క్లబ్‌లో రూ.2 కోట్ల రూపాయలతో నిర్మించిన అదనపు గదులు, కాన్ఫరెన్స్ హాల్‌ను మంత్రి ప్రారంభించారు. నల్లగొండ క్లబ్‌లో మంచి వాతావరణం ఉందని, పట్టణ ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మంత్రి అన్నారు. క్లబ్ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.

నల్లగొండ పట్టణ ప్రజలకు 24 గంటల తాగునీరు అందించేందుకు రూ.125 కోట్లతో పనులు చేపట్టడం జరిగిందని, ఆరు నెలల్లో పనులు పూర్తిచేసి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్తి చేయడం తన ప్రధాన లక్ష్యాల్లో ఒకటని , ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకుమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో

నిధులు సమకూర్చుకుని పనులను ముందుకు తీసుకెళు_న్నామని తెలిపారు. ఆగస్టు 2028 నాటికి సొరంగ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. గతంలో రూ.2 వేల కోట్లు ఉన్న ఎస్ ఎల్ బి సి అంచనా వ్యయం ప్రస్తుతం రూ.5 వేల కోట్లకు పెరిగిందని, సొరంగ పనుల్లో ఇప్పటికే చాలా పురోగతి సాధించామని తెలిపారు.

ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి చెప్పారు. నల్లగొండ పట్టణ అభివృద్ధిలో భాగంగా రూ.900 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నామని, పట్టణంలో ట్రాఫిక్ ప్రమాదాలను తగ్గించడంతో పాటు, నల్లగొండను అందమైన నగరంగా తీర్చిదిద్దేందుకు రోడ్ల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ,సుమారు రూ.1,400 కోట్ల విలువైన పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని చెప్పారు. రూ.300 కోట్లతో అండర్ డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసి ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డబల్ రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. నేషనల్ ఫండ్ నుంచి రూ.15 కోట్లతో పట్టణంలోని రోడ్లను అభివృద్ధి చేసి పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.1,300 కోట్లతో హ్యామ్ రోడ్ల పనులు చేపడుతున్నామని, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.2,500 కోట్లతో రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. తాను ఎక్కడ ఉన్నా నల్లగొండకు అత్యంత ప్రాధాన్యం ఇస్తానని స్పష్టం చేశారు. నల్లగొండ క్లబ్ అభివృద్ధికి పక్కనే ఉన్న ఎకరం స్థలాన్ని కూడా సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. కలెక్టర్‌తో మాట్లాడి క్లబ్‌కు భూమి ఇప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని క్లబ్ మాదిరిగా నల్లగొండ క్లబ్‌ను కూడా మరింత అభివృద్ధి చేసేందుకు సహకరిస్తానని చెప్పారు.

నల్గొండ పట్టణంలోని బొట్టుగూడ పాఠశాల నిర్మాణానికి రూ.12 కోట్లు కేటాయించి అభివృద్ధి చేశానని మంత్రి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పాత టౌన్‌లో రూ.10 కోట్లతో త్వరలో లైబ్రరీ నిర్మించడంతో పాటు, విద్యార్థులకు కోచింగ్, ఫౌండేషన్ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. నల్లగొండ పట్టణం, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన ప్రతి పనిని ప్రాధాన్యతతో చేపట్టి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తన లక్ష్యమని మంత్రి అన్నారు.ఈ ఈ కార్యక్రమంలో నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఆర్డీవో వై. అశోక్ రెడ్డి ,క్లబ్ అధ్యక్షుడు గోలి అమరేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి ల్, మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఏదుల శ్రీధర్ రెడ్డి, గుమ్మల జానకి రెడ్డి ,క్లబ్ సెక్రటరీ చల్ల వెంకటరమణ, కాసర్ల వెంకటరెడ్డి క్లబ్ మెంబర్స్ డాక్టర్ పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.






## రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ పోటీల్లో ముచ్చర్ల శ్రీనివాస్‌కు అవార్డు

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అభినందనలు

నల్లగొండ బ్యూరో, ఆగస్టు 23 (వార్తా వేదిక సూర్య )

ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన అవార్డు కార్యక్రమంలో రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ పోటీల్లో ప్రతిభ కనబరిచి అవార్డు అందుకున్న ఉమ్మడి నల్గొండ జిల్లా ద హన్స్ ఇండియా ఫోటోగ్రాఫర్ ముచ్చర్ల శ్రీనివాస్‌ను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అభినందించారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించి, అవార్డు అందుకున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఫోటోగ్రఫీ రంగంలో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొని ముచ్చర్ల శ్రీనివాస్‌ను అభినందించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## అతిధి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

నల్లగొండ బ్యూరో, ఆగస్టు 23 (వార్తా వేదిక సూర్య )

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (ఆటానమస్) నల్లగొండ లో 2026 - 27 విద్యా సంవత్సరానికి మూడు విభాగాల్లో ఖాళీగా ఉన్న అతిధి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. శ్రీనివాస రాజు ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాళీల వివరాలు బి. ఎస్. సి లైఫ్ సైన్సెస్, ఫార్మస్యూటికల్స్ మ్యానిఫ్యాక్చరింగ్, క్వాలిటీ విభాగంలో ఒక పోస్ట్ ఖాళీగా ఉంది. ఎం.ఎస్.సి.కెమిస్ట్రీ పూర్తి చేసిన వారు ఈ పోస్ట్ కు అర్హులు. కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్ విభాగంలో ఒక పోస్ట్ ఖాళీగా ఉంది. ఎం. ఎస్. సి కంప్యూటర్ సైన్స్, లేదా ఎం. సి. ఏ లేదా ఎం. టెక్ పూర్తి చేసిన వారు ఈ పోస్ట్ కు అర్హులు. హెల్త్ కేర్ విభాగంలో లో ఒక పోస్ట్ ఖాళీగా ఉంది. ఎం. ఎస్. సి జూవాలజి పూర్తి చేసిన వారు అర్హులు.సంబంధిత సబ్జెక్టులలో 55% ఎస్. సి/ఎస్.టి అభ్యర్థులకు 50% మార్కులు కలిగి ఉండాలి నెట్/ సెట్/ పీహెచ్డీ, బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును ఆసక్తిగల అభ్యర్థులు 25 ఆగస్టు 2026 లోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు అందజేయలని ఆయన అన్నారు.

## చలో హైదరాబాద్ కి తరలి వెళ్లిన నల్లగొండ జిల్లా ఉద్యోగ ఉపాధ్యాయులు




నల్లగొండ బ్యూరో, ఆగస్టు 23 (వార్తా వేదిక సూర్య )

తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సి.పి.ఎస్ విధానం రద్దుకోసం ఏర్పాటు చేసిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి యూనియన్ ఉమ్మడి జిల్లా ఇంచార్జ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా నుండి ఉద్యోగ ఉపాధ్యాయులు భారీగా తరలి వెళ్లడం జరిగింది.ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రాగానే సి పి ఎస్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ విధానం తీసుకుని వస్తానని చెప్పి అధికారం లోకి వచ్చి మూడు సంవత్సరాలు అయినప్పటికీ ఆ విషయాన్ని విస్మరించింది అని...అదే విషయాన్ని గుర్తు చేద్దామనే ఉద్దేశ్యంతో లక్ష మంది ఉద్యోగులతో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.సి.పి.ఎస్ రద్దుచేసే వరకు ఈ పోరాటం ఆగేది లేదు అని తెలిపారు .

వివిధ మార్గాల ద్వారా జిల్లా నుండి 3000 మంది ఉపాధ్యాయ ఉద్యోగులు చలో హైదరాబాద్ కి వెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమలో జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి అందుగుల విజయ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి శాగంటి రోహిణి, జిల్లా మహిళా కార్యదర్శి సుచరిత, జిల్లా మహిళా కార్యదర్శి రేణుక, ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షుడు భిక్షం,నాయకులు సోమనాథ్, గురిజ మహేష్,హేమంత్ , శ్రీనివాస్, సంపత్ ,శైలజ, జ్యోతి, శాంతమ్మ లు పాల్గొన్నారు.



## తపస్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానశీ.

నల్లగొండ బ్యూరో, ఆగస్టు 23 (వార్తా వేదిక సూర్య )



తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నల్లగొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 26 న నల్గొండ పట్టణ కేంద్రంలోని రత్న ఫంక్షన్ హాల్ లో జిల్లా స్థాయిలో "గురువందన కార్యక్రమం" నిర్వహించడం జరుగుతుంది. జ్ఞాన సంపదకు నిలయమైన గురువు గొప్ప తనాన్ని, గురువు ఔన్న త్యాన్ని చాటడానికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ గురువందనం కార్యక్రమంలో జిల్లాలో అత్యుత్తమ పనితీరు కనపరుస్తున్న గురువులను సంఘాలకు అతీతంగా ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు,మోడల్ స్కూల్స్,రెసిడెన్షియల్ స్కూల్స్ మరియు కేజీబీవీ పాఠశాలల నుండి ఆయా మండల విద్యాధికారులు,ప్రధానోపాధ్యాయులు,ప్రిన్సిపల్స్, ఎస్ . ఓ, మండల బాధ్యుల ఉమ్మడి సలహాలు సూచనలతో ఎంపిక చేసి సన్మానించడం జరుగుతుంది. ఈ మహోన్నత కార్యక్రమంనకు ఉపాధ్యాయులుగా మనందరం హాజరై గురువులకు వందనాలు పలుకుదామని ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏ.వి.యన్.రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని. ఈ కార్యక్రమానికి నల్గొండ జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో హాజరు కావాలని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తిని భాస్కర్ గౌడ్,రేణికుంట్ల రాజశేఖర్ తెలియజేశారు.

## సియంబి చర్చిలో ఘనంగా ఉమెన్స్ సండే వేడుకలు

నాగర్ కర్నూల్ ఆగస్టు 23 ( వార్త వేదిక సూర్య ) :



నాగర్ కర్నూల్ జిల్లాలోని సెంటినరీ ఎంబి చర్చ్ లో ఆదివారం ఉమెన్స్ సండే వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాదులోని హిత అకాడమీ లో థియోలాజి ఫ్యాకల్టీగా విధులు నిర్వహిస్తున్న శ్రీమతి యం.శాంతకుమారి ముఖ్య ప్రసంగికులుగా హాజరయ్యారు. సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వాసులకు తల్లి అయిన శార కుమార్తెలుగా క్రైస్తవ స్త్రీలందరూ క్రీస్తు ప్రేమలోనూ, విశ్వాసంలోనూ, భక్తిలోను అభివృద్ధి చెంది కుటుంబానికి శాంతి సమాధానంగా ఉంటూ సంఘానికి దేశానికి మార్గ నిర్దేశకులుగా ఉండాలని బోధించారు. అనంతరం మహిళా కమిటీ చైర్పర్సన్ హుల్ద ,శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ స్త్రీలందరూ ఏసు ప్రభువును విశ్వాసంలోను, ప్రేమలోనూ, మాదిరిగా ఉంచుకొని సంఘానికి దేశానికి ఉపయోగపడే విధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సియంబి చర్చ్ ఉమెన్స్ కమిటీ సంఘస్తులు, యూత్ వారు సుమారు 300 మంది పాల్గొన్నారు.

## శివాలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



మహబూబ్ నగర్ బ్యూరో, ఆగస్టు 23(వార్త వేదిక సూర్య ):

దేవరకద్ర నియోజకవర్గం మూసాపేట మండలం పోల్కంపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.50 లక్షల నిధులతో చేపట్టనున్న శ్రీ శివాలయ పునర్నిర్మాణ పనులకు దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ జి. మధుసూదన్ రెడ్డి (+వీ=) భూమిపూజ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ పునరుద్ధరణ, అభివృద్ధి పనులకు రూ.351 కోట్లు, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.250 కోట్లు, కురుమూర్తి స్వామి ఆలయ అభివృద్ధి పనులకు రూ.110 కోట్లు మంజూరు చేసి ఆలయాలను అభివృద్ధి చేయడంతో పాటు భక్తులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.దేవాలయాల అభివృద్ధితో పాటు వాటి ప్రాచీన వైభవాన్ని కాపాడుతూ, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా అవసరమైన సౌకర్యాలు కల్పించడంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. పోల్కంపల్లి శ్రీ శివాలయ పునర్నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేయడం గ్రామీణ ప్రాంతాల దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.



అనంతరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే పలు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరం

మహబూబ్ నగర్ ఆగస్టు 23 ( వార్త వేదిక సూర్య ) :




మహబూబ్ నగర్ లయన్స్ క్లబ్, సుప్రభాత్ లయన్స్ క్లబ్, పాలమూరు లయన్స్ క్లబ్ ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మహబూబ్ నగర్ లోని బాల్ భవన్ లో నిర్వహించిన ఉచిత వెరి కోస్ వేయిన్స్ వైద్య శిబిరం విజయవంతమైంది. హైదరాబాద్ కు చెందిన ఏవిస్ వాస్క్యులర్ సెంటర్ సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంను లయన్స్ ఇంటర్నేషనల్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్, రెడ్ క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్ ప్రారంభించారు.

డాక్టర్ దివ్య, మార్కెటింగ్ హెడ్ జగదీష్, హెల్త్ కౌన్సిలర్ నజీర్ ల ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు చేశారు. లయన్స్ క్లబ్ ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నటరాజ్ కోరారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ సుదర్శన్, ఆయా క్లబ్ ల ప్రతినిధులు చెన్నయ్య, ప్రవీణ్ కుమార్, బాబుల్ రెడ్డి, నాగరాజు, వినోద్, వై. ప్రవీణ్, యతి రాజాచారి, లయన్ అశ్విని చంద్రశేఖర్, బాల్ రాజ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జనగణనలో బీసీ కులగణన చేపట్టాలనే బీసీ కమిషన్ చైర్మన్ లేఖను స్వాగతిస్తున్నాం : జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్

నాగర్ కర్నూల్ ఆగస్టు 23 ( వార్త వేదిక సూర్య ) :

నాగర్ కర్నూల్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ జనగణన ప్రక్రియలో భాగంగా బీసీల కులగణన కూడా చేపట్టాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కి బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ లేఖ రాయడాన్ని పూర్తిగా స్వాగతిస్తోంది అని అన్నారు. ఎస్సీ, ఎస్టీల తరహాలోనే బీసీ, ఓబీసీల కులాల వారీగా లెక్కలు సేకరించడం చాలా అవసరం. రాజ్యాంగపరంగా ఎస్సీ, ఎస్టీలకు ఉన్న వెసులుబాటు బీసీలకు లేకపోవడం బాధాకరం. సామాజిక న్యాయం అందించాలంటే, పక్కా ఆధారాలతో రిజర్వేషన్లు, విద్య, ఉపాధి, సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే కులాల వారీ గణాంకాలు తప్పనిసరి అని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, రాబోయే జనగణనలో బీసీ, ఓబీసీ కులగణనను తప్పనిసరి చేస్తూ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియాకు ఆదేశాలు ఇవ్వాలని, గతంలో కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బీసీల న్యాయమైన డిమాండ్ అయిన కులగణన కోసం జాతీయ బీసీ సంక్షేమ సంఘం నిరంతరం పోరాడుతుందని కుంభం మల్లేష్ గౌడ్ స్పష్టం చేశారు.



# నాగర్‌కర్నూల్




## ఆటోల నిరవధిక బందును జయప్రదం చేయండి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 23 (వార్త వేదిక సూర్య ):**
ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 24 నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు, ఆటో సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు.

ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు, ఆటో సంఘాల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు రాములు యాదవ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, బీఆర్‌టీయూ ఆటో యూనియన్ జిల్లా నాయకులు బాబుమియా మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రమాదాలు జరిగినప్పుడు డ్రైవర్లనే బాధ్యులను చేస్తూ యావజ్జీవ శిక్షలు విధించేలా తీసుకొచ్చిన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించడంతో పాటు ఆటో చార్జీలు పెంచాలని, మోటార్ వెహికల్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను తీసుకొచ్చి ఆటో డ్రైవర్లను కార్మికులుగా గుర్తించకుండా సమ్మె, పోరాట హక్కులను నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తోందని నాయకులు విమర్శించారు. వెంటనే లేబర్ కోడ్లను రద్దు చేసి ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆగస్టు 24 నుంచి ప్రారంభమయ్యే నిరవధిక సమ్మెకు ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మద్దతుగా నిలిచి జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దిప్లా నాయక్, టీఎన్‌టీయూసీ నాయకులు ధన్వాడ రాములు, సీఐటీయూ నాయకులు రాజ్‌కుమార్, నాగేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ కళాశాల ఖమ్మంలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

**ఖమ్మం, ఆగస్టు 23 (వార్త వేదిక సూర్య )**








ఖమ్మం నారాయణ జూనియర్ కళాశాలలో సీనియర్, జూనియర్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు.

ఈ సందర్భంగా కళాశాల డీన్ శ్రీకాంత్ మాట్లాడుతూ, సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఆదర్శంగా, రోల్ మోడల్స్‌గా నిలవాలని సూచించారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ దశ ఎంతో కీలకమైనదని, ఈ దశలో కష్టపడి చదివి మంచి లక్ష్యాలను ఏర్పరచుకున్న వారు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని అన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, తల్లిదండ్రుల ఆశయాలను, వారి కలలను నెరవేర్చే విధంగా కష్టపడి చదవాలని సూచించారు.

కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ, సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలుగుతూ విద్యతో పాటు మంచి విలువలను అలవర్చుకోవాలని సూచించారు.

అనంతరం సీనియర్, జూనియర్ విద్యార్థులు వివిధ ఆటలు, పాటలు మరియు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని ఫ్రెషర్స్ డే వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల మధ్య స్నేహభావాన్ని, పరస్పర పరిచయాన్ని పెంపొందించేలా సాగింది.

ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ శ్రీకాంత్, ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, హాస్టల్ క్యాంపస్ ప్రిన్సిపల్ పవన్ కుమార్, ఆ+వీ వెంకటనారాయణ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పల్లె మేల్కొనాలి.. 'మత్తు' వీడాలి!



**గడగోజు రవీంద్రాచారి, జర్నలిస్టు.-9848772232**

పల్లె సీమలంటే పచ్చని పట్టు బొమ్మలు.. స్వచ్ఛమైన గాలి.. కల్మషం లేని నీరు.. నేలతల్లి ఒడిలో పండే స్వచ్ఛమైన తిండి.. మనుషుల మధ్య మమకారం, కష్టసుఖాల్లో తోడుగా నిలిచే ఆప్యాయత. అలాంటి పచ్చని పల్లె కాపురాల్లోకి ఇప్పుడు మత్తు మహమ్మారి చొరబడుతోంది. మద్యం బెల్టుషాపులు, గంజాయి చాపకింద నీరులా విస్తరిస్తూ.. కుటుంబాల్లో చిచ్చు పెడుతూ.. యువత భవిష్యత్తును చీకట్లోకి నెడుతున్నాయి.

'పట్నం మత్తు పల్లె బాట పట్టింది.. బడికెళ్లాల్సిన బాబులను వ్యసనాల ఊబిలోకి నెట్టింది. నిన్ను కన్నందుకు మాకు తలవంపులు తెస్తివిరా.. ఉన్న ఊరిలో నీవు పుట్టకుండా బాగుండునేమో రా ఈ అమ్మ కడుపులో..' మత్తుకు బానిసైన బిడ్డను చూసి ఓ తల్లి పడే నిశ్శబ్ద రోదన ఇది! ఇది ఒక్క ఇంటి ఆవేదన కాదు.. మత్తు పంజాలో చిక్కుకుంటున్న పల్లె సీమల ఆవేదన. ఒకప్పుడు ప్రశాంతతకు, ఆత్మీయతకు, సంస్కృతికి చిరునామాగా ఉన్న పల్లెల్లో.. మద్యం బెల్టుషాపులు, గంజాయి చాపకింద నీరులా విస్తరిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. బడికి వెళ్లాల్సిన వయసులోనే కొందరు యువత వ్యసనాల బారిన పడుతుండటం భవిష్యత్తుపై భయాందోళనలు రేకెత్తిస్తోంది.



### గడప దాటిన మత్తు

పల్లెల్లో కిరాణా దుకాణాలు, పాన్‌షాపులు, ప్రైవేటు ఇళ్ల మాటున బెల్టుషాపులు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ అక్రమ మద్యం విక్రయాలను అడ్డుకుంటున్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తిస్థాయిలో నియంత్రణలోకి రాలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో బెల్టుషాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో.. అక్రమ మద్యం విక్రయాలపై నియంత్రణను మరింత పటిష్ఠం చేయాలని ప్రజల నుంచి డిమాండ్ వస్తోంది.

### బడి వయసులోనే బానిసత్వం

పట్టణాలలోనే కాదు గంజాయి దందా గ్రామాల వైపు విస్తరిస్తుండటం మరింత ఆందోళనకరం. విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాలు చేరుతున్నాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. చెడు స్నేహాలు, సోషల్ మీడియా ప్రభావం, మత్తు పదార్థాలపై అవగాహన లేమి, కుటుంబ పర్యవేక్షణ లోపం వంటి కారణాలు పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. పుస్తకాలు పట్టాల్సిన లేత చేతులు మత్తు పదార్థాల వైపు మళ్లితే.. దాని ప్రభావం వ్యక్తిపైనే కాదు.. కుటుంబం, సమాజం, భవిష్యత్ తరాలపైనా పడుతుంది.

### ఆరోగ్యానికి దెబ్బ.. ఇంటికి భారం

మద్యం వ్యసనం కాలేయ వ్యాధులు, అధిక రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు, మానసిక ఆందోళనకు దారితీయవచ్చు. సంపాదనలో పెద్ద భాగం మద్యానికి ఖర్చవడంతో అప్పులు, కుటుంబ కలహాలు, గృహహింస, పిల్లల చదువులకు ఆటంకం వంటి సమస్యలు తలెత్తుతాయి. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం జ్ఞాపకశక్తి, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. వ్యసనం ముదిరితే చదువుకు దూరం కావడం, నేరప్రవృత్తి వైపు మళ్లడం వంటి ప్రమాదాలు పెరుగుతాయి.

### ఉక్కుపాదం మరింత బిగించాలి

గంజాయి నిర్మూలనకు ప్రభుత్వం, పోలీసు శాఖ చేపడుతున్న చర్యలు అభినందనీయం. అయినా.. పట్టణాల్లోని గంజాయి సరఫరా గ్రామాలకు చేరకుండా అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది. సరఫరా మార్గాలను గుర్తించి మూలాలను ఛేదించాలి. గ్రామస్థాయి వరకు గంజాయి టెస్టులను నిర్వహించాలి. ఒకసారి దాడులు చేసి ఆగిపోకుండా.. నిరంతర నిఘా, తనిఖీలతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి.

### బెల్టుకు కళ్లెం

బెల్టుషాపులను అరికడుతున్నామని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నా.. పల్లెల్లో అక్రమ మద్యం విక్రయాలు పూర్తిస్థాయిలో నియంత్రణలోకి రాలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని చోట్ల విచ్చలవిడిగా విక్రయాలు సాగుతున్నాయన్న విమర్శల నేపథ్యంలో.. నియంత్రణ చర్యలను మరింత పటిష్ఠం చేయాలని ప్రజలు కోరుతున్నారు. కేవలం తనిఖీలు, కేసులతో సరిపెట్టకుండా.. అక్రమ విక్రయాలకు శాశ్వతంగా అడ్డుకట్ట పడేలా నిరంతర పర్యవేక్షణ అవసరం.

### ప్రతి పల్లె ఓ అడుగు

మత్తు నిర్మూలనలో ప్రభుత్వ చర్యలకు ప్రజల భాగస్వామ్యం తోడైతేనే ఫలితం కనిపిస్తుంది. అనేక గ్రామపంచాయతీలు బెల్టుషాపుల నిరోధానికి తీర్మానాలు చేస్తున్నాయి.ఇది ప్రతి పల్లెకు విస్తరించాలి . గ్రామస్థులు మత్తు వ్యతిరేక చైతన్యాన్ని పెంచాలి. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఉండాలి. యువతను మత్తుకు దూరంగా ఉంచేందుకు పాఠశాలలు, కుటుంబాలు సమన్వయంతో పనిచేయాలి.

### అవగాహనే తొలి అడుగు

మద్యం, గంజాయి వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్థులకు నిరంతరం అవగాహన కల్పించాలి. వైద్యులు, మానసిక నిపుణులు, పోలీసు, ఎక్సైజ్ అధికారులు, న్యాయ నిపుణులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. వ్యసనానికి లోనైన వారిని నేరస్థులుగా ముద్ర వేయకుండా.. అవసరమైన కౌన్సెలింగ్, వైద్యం, పునరావాస సేవలు అందించాలి. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనించి.. తొలిదశలోనే స్పందించాలి.

### పల్లె మేల్కొంటే.. మత్తు పారిపోతుంది!

మద్యం, గంజాయి వ్యసనం ఒక్క వ్యక్తి సమస్య కాదు.. కుటుంబాన్ని కుదేలు చేసి సమాజాన్ని బలహీనపరిచే ముప్పు. ప్రభుత్వాలు చట్టాలను మరింత పటిష్ఠం చేయాలి. పోలీసు, ఎక్సైజ్ శాఖలు సమన్వయంతో నిరంతర నిఘా కొనసాగించాలి. పట్టణాల్లో ఉన్న గంజాయి పల్లెలకు విస్తరించకుండా సరఫరా మార్గాలపై కఠిన నిఘా పెట్టాలి. బెల్టుషాపుల నియంత్రణను కాగితాలకే పరిమితం చేయకుండా.. క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా చర్యలు తీసుకోవాలి.

ఒక్క కుటుంబాన్ని మత్తు నుంచి కాపాడితే ఒక ఇల్లు నిలబడుతుంది.. వంద కుటుంబాలు మారితే ఒక పల్లె బాగుపడుతుంది. మద్యం, గంజాయి కోసం ఖర్చయ్యే ప్రతి రూపాయి పిల్లల విద్య, ఆరోగ్యం, కుటుంబ అవసరాలకు మళ్లితే.. పల్లె ఆర్థికంగా, సామాజికంగా బలపడుతుంది. యువత శక్తి విద్య, ఉపాధి, వ్యవసాయం, సమాజ సేవ వైపు మళ్లుతుంది.

ప్రతి పల్లె కదలాలి.. ప్రతి కుటుంబం మేల్కోవాలి.. గంజాయి--మద్యాన్ని తరమాలి! మత్తు రహిత పల్లెగా.. సమష్టి సంకల్పంతో సాధించగలం లక్ష్యంతో ముందుకు సాగాలి.

# వంద వారాలు.. వందలాది హృదయాల్లో నిలిచిన సేవ!

**ఆకలి తీర్చే అన్నదానం.. ఆప్యాయత పంచే సేవ...**

**నవాబుపేట సంతలో జేకే కుటుంబం ట్రస్ట్ అరుదైన సేవా ప్రస్థానం..**

**నేటితో 100 వారాలు పూర్తి.. నిరంతర అన్నదానానికి మరో మైలురాయి..**




**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 23 (వార్త వేదిక సూర్య ):**
ఒక రోజు కాదు.. ఒక నెల కాదు.. ఏడాది కాదు.. ఏకంగా 100 వారాలు!

ఆకలితో వచ్చే వారికి అన్నం పెట్టాలనే ఒక చిన్న ఆలోచన.. నేడు వంద వారాల నిరంతర సేవగా రూపుదిద్దుకుంది. మాటల్లో చెప్పే సేవా భావాన్ని చేతల్లో చూపిస్తూ జేకే కుటుంబం ట్రస్ట్ నిర్వహిస్తున్న ఉచిత భోజన కార్యక్రమం నేటితో 100 వారాలు పూర్తి చేసుకుంది.

నవాబుపేట సంతకు ప్రతి వారం చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది ప్రజలు తరలివస్తుంటారు. రైతులు, కూలీలు, చిరు వ్యాపారులు, మహిళలు, వృద్ధులు.. ఇలా సంతకు వచ్చిన ప్రతి ఒక్కరి ఆకలి తీర్చాలనే సంకల్పంతో ట్రస్ట్ సభ్యులు వారానికి ఒకసారి ఉచితంగా భోజనం అందిస్తున్నారు. కులం, మతం, ప్రాంతం, స్థాయి అనే తేడా లేకుండా అందరికీ అన్నం పెట్టడం ఈ సేవా కార్యక్రమానికి ప్రత్యేకతగా మారింది.

**ఒక ఆలోచన.. 100 వారాల సేవ..**

సమాజానికి ఏదైనా చేయాలనే ఆలోచన చాలా మందికి ఉంటుంది. కానీ ఆ ఆలోచనను నిరంతర కార్యాచరణగా మార్చడం మాత్రం కొద్దిమందికే సాధ్యం. జేకే కుటుంబం ట్రస్ట్ కూడా అలాంటి సేవా సంకల్పంతోనే ముందుకు సాగింది.

మొదటి వారం ప్రారంభమైన అన్నదానం.. ఆ తర్వాత రెండో వారం, పదో వారం, యాభైవ వారం.. ఇలా ఒక్కో అడుగు ముందుకు వేస్తూ నేడు 100వ వారానికి చేరుకుంది.

ఈ వంద వారాల ప్రయాణంలో ఎన్నో చేతులు అన్నం వడ్డించాయి.. ఎందరో ఆకలి తీర్చుకున్నారు.. మరెందరో ఈ సేవను అభినందించారు.

**సంతకు వచ్చేవారికి ఆత్మీయ ఆతిథ్యం..**

నవాబుపేట సంత అంటే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఒక ముఖ్యమైన కూడలి. తెల్లవారుజాము నుంచే రైతులు, కూలీలు, వ్యాపారులు, కొనుగోలుదారులతో సంత సందడిగా మారుతుంది.

అలాంటి సమయంలో సంతకు వచ్చే వారికి ఉచితంగా భోజనం అందించడం ఎంతో ఉపయుక్తంగా మారింది. కేవలం భోజనం వడ్డించడం మాత్రమే కాకుండా.. ఆప్యాయంగా పలకరిస్తూ, ప్రేమతో భోజనం పెట్టడం ఈ కార్యక్రమానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది.

**అన్నం కంటే గొప్పది.. ఆప్యాయత..**

ఒక పూట భోజనం ఆకలి తీర్చవచ్చు. కానీ ఆ భోజనం వెనుక ఉన్న ప్రేమ, ఆప్యాయత మనసులో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

జేకే కుటుంబం ట్రస్ట్ ఉచిత భోజన కార్యక్రమంలో అదే కనిపిస్తోంది. "ఆకలితో వచ్చిన వారికి అన్నం పెట్టాలి.. మనకు చేతనైనంత సేవ చేయాలి" అనే భావనతో సభ్యులు చేస్తున్న సేవ స్థానికుల ప్రశంసలు అందుకుంటోంది.

**100 వారాలు.. ఒక సేవా మైలురాయి..**

వంద వారాల పాటు ఒక కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహించడం సాధారణ విషయం కాదు. ప్రతి వారం అవసరమైన ఏర్పాట్లు చేయడం, భోజనం సిద్ధం చేయడం, సంతకు వచ్చిన వారికి వడ్డించడం.. ఇలా ప్రతి దశలోనూ సేవా భావంతో ముందుకు సాగడం అభినందనీయం.

నేటితో 100 వారాలు పూర్తి చేసుకోవడం జేకే కుటుంబం ట్రస్ట్ సేవా ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.

**సేవకు ముగింపు లేదు.. ఇది మరో ఆరంభం..**

100 వారాలు పూర్తి కావడం ఈ సేవా కార్యక్రమానికి ముగింపు కాదు.. మరిన్ని వారాలు, మరిన్ని సంవత్సరాలు సేవ కొనసాగించేందుకు ఒక కొత్త ఆరంభం.

ఆకలి ఉన్నంతకాలం అన్నం అవసరం ఉంటుంది. సేవ చేయాలనే మనసున్నంతకాలం ఇలాంటి కార్యక్రమాలకు విలువ ఉంటుంది. జేకే కుటుంబం ట్రస్ట్ కూడా ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

**వంద వారాల సేవకు వందనం..**

వారాలు గడిచాయి..
రోజులు మారాయి..
కానీ సేవా సంకల్పం మాత్రం మారలేదు.
ఒక్క ముద్ద అన్నం.. ఒకరి ఆకలి తీర్చొచ్చు.
ఒక్క మంచి పని.. వందల మందికి స్ఫూర్తినివ్వొచ్చు.

నవాబుపేట సంతలో నేటితో 100 వారాల అన్నదాన సేవను పూర్తి చేసుకున్న జేకే కుటుంబం ట్రస్ట్‌లిలి మానవత్వానికి, సేవా స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది.

ఆకలి తీర్చే చేతులకు అభినందనలు..
ఆప్యాయత పంచే హృదయాలకు వందనం..
100 వారాల సేవా ప్రస్థానానికి శుభాకాంక్షలు!



# ఫీజు బకాయిలు చెల్లించే వరకు బీజేపీ పోరాటం ఆగదు

హైదరాబాద్ ఆగస్టు 23: ( వార్తా వేదిక సూర్య )

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యావ్యవస్థ సంక్షోభంలోకి వెళ్లిందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.12 వేల కోట్లకు చేరడంతో సుమారు 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని అన్నారు. ఫీజు బకాయిలను ప్రభుత్వం పూర్తిగా చెల్లించే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

న్యూఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో రామచందర్‌రావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలు పెడితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో రూ.4 వేల కోట్లు బకాయిలు పెరిగాయని ఆరోపించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలలు అధ్యాపకులకు జీతాలు చెల్లించలేకపోతున్నాయని, విద్యార్థుల ఒరిజినల్ ధ్రువపత్రాలను నిలిపివేస్తున్నాయని పేర్కొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై హైకోర్టు తీవ్రంగా స్పందించిన తర్వాత ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరానికి ముందస్తుగా రూ.2 వేల కోట్లు విడుదల చేస్తామని ప్రకటించినా.. ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు.

ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రేపటి నుంచి రెండు రోజుల పాటు నిరాహార దీక్ష చేపడుతున్నట్లు రామచందర్‌రావు తెలిపారు. దీక్షకు పోలీసులు అనుమతి నిరాకరించి తిరస్కరణ లేఖ ఇచ్చినా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. రోడ్డుపై కాకపోతే పార్టీ కార్యాలయ ప్రాంగణంలోనే దీక్ష నిర్వహించి తీరుతామని చెప్పారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలనా ప్రస్థానం 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'మోదీ ఏ 25 సేవా సంకల్ప అభియాన్' నిర్వహించనున్నట్లు రామచందర్‌రావు తెలిపారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. పీఎం కిసాన్, పీఎం ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్ తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిదారులకు కలిగిన ప్రయోజనాలను వివరించే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

ఢిల్లీలో జరిగిన సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ నాలుగు గంటల పాటు రాష్ట్ర బీజేపీ నేతలతో సమావేశమై దిశానిర్దేశం చేశారని, పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సంస్థాగత పటిష్ఠతపై సూచనలు చేశారని రామచందర్‌రావు తెలిపారు.

తెలంగాణ విద్యార్థులకు ఎన్నికల సమయంలో 'యూత్ డిక్లరేషన్' పేరుతో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. పాలిటెక్నిక్ విద్యార్థులపై లాఠీచార్జీలు జరుగుతున్నా, ఆయుష్ విద్యార్థులు ఉపకార వేతనాల కోసం ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. విద్యార్థుల సమస్యలపై సమాధానం చెప్పేందుకు రాహుల్‌గాంధీ హైదరాబాద్‌కు రావాలని సవాల్ చేశారు.

'జెన్ జెడ్' వంటి పదజాలం అర్బన్ నక్సల్స్, అల్ట్రా లెఫ్ట్ భావజాలం నుంచి వచ్చిందని, దేశంలో ఉన్నది కేవలం 'యువ భారత్' మాత్రమేనని రామచందర్‌రావు వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం '30 శాతం కమీషన్ల సర్కార్'గా మారిందని ఆయన ఆరోపించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుటుంబ పాలన, దోపిడీకి పాల్పడితే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 'బ్రదర్స్ సర్కార్'గా మారి దోపిడీకి పాల్పడుతోందని విమర్శించారు. రియల్ ఎస్టేట్ రంగంలో 22ఏ పేరుతో బిల్డర్లను వేధిస్తూ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. 22ఏ భూముల సమస్యపై బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో ఎమ్మెల్యేలు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి, ఆందోళనలు నిర్వహిస్తున్నారని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో అవినీతి కొందరి చేతుల్లోనే కేంద్రీకృతం కావడంతో నేతల్లో అసంతృప్తి, అంతర్గత విభేదాలు, రహస్య సమావేశాలు జరుగుతున్నాయని రామచందర్‌రావు ఆరోపించారు. ప్రజలు ఐదేళ్ల పాలన కోసం అధికారం ఇచ్చినా.. ప్రస్తుత ప్రభుత్వ పనితీరును చూస్తుంటే ఐదేళ్లు కూడా కొనసాగడం కష్టమేనని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలను పట్టించుకోని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు తిరస్కరించి బీజేపీని ప్రత్యామ్నాయంగా చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

# నిరాశాజనకంగా ఖరీఫ్ వ్యవసాయ సీజన్

### నిండని చెరువులు- నాట్లు పడని మాగానీలు

### వరి సాగు అంతంత మాత్రమే

కారేపల్లి ఆగస్టు 23 ( వార్తా వేదిక సూర్య )

ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతులు నిరాసాన్నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఖరీఫ్ సీజన్లో వరినాట్లు వేసే దశ అత్యంత కీలకం. ఏటా ప్రస్తుత సమయానికి మండలంలో జోరుగా దమ్ము, వరినాట్లు పనులు జరుగుతుంటాయి. ప్రతి సంవత్సరం మండలంలో సుమారు 14000 ఎకరాలకు పైగా వరి పంట సాగు చేస్తారు ఆగస్టు మొదటి వారంనాటికి దాదాపు సగం విస్తీర్ణంలో వరినాట్లు పూర్తవుతాయి. కాగా ప్రస్తుత సీజన్లో ఎల్నినో ప్రభావంతో గత రెండు నెలల్లో సాధారణ వర్షపాతంలో సగం కూడా కురవలేదు. ఇంతవరకు వరినాట్లు మండలంలో 2 శాతానికి కూడా మించలేదు. మండల వ్యాప్తంగా వరి సాగు అంతంత మాత్రం గాని కొనసాగుతుంది. సింగరేణి మండలంలో నెలకొన్న తీవ్రవర్షాభావ పరిస్థితులు అన్నదాతలను.. ముఖ్యంగా వరి సాగు చేసే రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. జూన్, జూలై నెలల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడ వ్యవసాయ పనులు మందగించాయి. అడపాదడపా కురుస్తున్న జల్లులతో కొంతమంది రైతులు ఆకుమడులను సిద్ధం చేసుకొని వరి విత్తనాలు చల్లారు. అవి మొలకెత్తినప్పటికీ సరిపడ నీరు (వర్షం) లేకపోవడంతో ఎదుగుదల లేక మొక్కలు ఎండిపోతున్నాయి. మరోవైపు పొలాల్లో కనీసం దుక్కులు కూడా దున్నలేదు. మండలంలో జూన్ ఒకటినుంచి ఆగస్టు 23వ తేదీ వరకు సరైన వర్షపాతం నమోదు కాకపోవడం ప్రధాన చెరువులలో ఆశించిన స్థాయిలో వరద నీరు రాకపోవడంతో పాటు కేవలం కుంటలు వర్షపు నీరు తోనే వరి నాట్లు సాగుతున్నాయి. అయితే ఇటీవల మండల అధికారులు వరి సాగుకు సరిపడ నీరు రాకపోతే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. ఇదే క్రమంలో ప్రధాన చెరువులలో తూములు తీయవద్దని ఆదేశించినట్లు తెలుస్తుంది. ఈ వారాంతంలో వర్షాలు కురుస్తాయని ఆశాభావంతో వర్షాల కోసం మండల రైతులు నిరీక్షిస్తున్నారు

# సమరానికి విద్యుత్ ఉద్యోగుల సన్నద్ధం

### ఈనెల 26 లోపు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

### పెండింగ్ లో ఉన్న 14 ప్రధాన సమస్యలు

### ఈనెల 27 నుంచి రిలే దీక్షలు చేపట్టేందుకు నిర్ణయం

హైదరాబాద్ ఆగస్టు 23: ( వార్తా వేదిక సూర్య )

దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్తు ఉద్యోగులు సమరానికి సన్నద్ధమవుతున్నారు. ఎంతో కాలంగా ప్రధాన సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి, అధికారులకు విన్నవించినప్పటికీ స్పందించకపోవడంతో ఆందోళన కార్యాచరణ రూపొందించారు. అత్యవసర సర్వీసు అయినందున ప్రభుత్వము స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలు అభిప్రాయపడుతున్నారు. విద్యుత్ ఉద్యోగులు ఆందోళనకు దిగితే ఇబ్బందులు తప్పవు. ఈ క్రమంలో ప్రభుత్వము విద్యుత్ ఉద్యోగుల సంఘాలతో చర్చలు జరిపి ఆందోళన కార్యక్రమాలు ప్రారంభించక ముందే సమస్యలు పరిష్కరిస్తే బాగుంటుందని పలువురు పేర్కొంటున్నారు. ఈనెల 19న హైదరాబాదులో ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు విద్యుత్ సౌధ వద్ద మహాధర్న కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎంతోమంది ఉద్యోగులు మహాధర్నాకు తరలివచ్చారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు సమస్యల పరిష్కారానికి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈనెల 26 లోపు 14 ప్రధాన సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 27 నుంచి రిలే దీక్షలు చేపట్టాలని మహా ధర్నా సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు. దీంతో విద్యుత్ ఉద్యోగులు సమరానికి సిద్ధమవుతున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో, నగరాలలో విద్యుత్ ఉద్యోగులు విలువైన సేవలను అందిస్తున్నారు. అత్యవసర సర్వీస్ కావడంతో నిరంతరము ప్రజలకు అందుబాటులో ఉండి ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించి ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వము వారి సమస్యలను పరిష్కరించకపోతే ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు సంబంధించిన 14 సమస్యలను పరిష్కరించాలని వాటిపై చర్చించేందుకు సమావేశాలు నిర్వహించాలని కొంతకాలంగా అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ స్పందన లేకపోవడంతో ఆందోళన కార్యాచరణ రూపొందించారు. వేతన సవరణ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ లోని కోల్, యాష్ హ్యాండ్లింగ్ పనుల టెండర్లను వెంటనే ఉపసంహరించుకోవాలని అంటున్నారు. విద్యుత్తు శాఖలోని కీలకమైన విభాగాలలో పొరుగు సేవల ఉద్యోగులను తీసుకోవడంతో సమస్యలు ఏర్పడుతున్నాయని అంటున్నారు. పొరుగు సేవల ఉద్యోగులతో ప్లాంట్ భద్రత దీర్ఘకాలిక పనిచేరుపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఉద్యోగ సంఘాల నాయకులు మహాధర్నా సందర్భంగా పేర్కొన్నారు. ఆర్టిజన్లకు, క్యాడర్ సీనియారిటీ, ప్రమోషన్, సర్వీస్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరుతున్నారు. 1999-2004 మధ్యకాలంలో నియామకమైన ఉద్యోగులకు జిపిఎఫ్, పెన్షన్ సదుపాయాలను కల్పించాలని కోరుతున్నారు. సిబ్బంది కొరత లేకుండా చూసేందుకు వెంటనే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఈనెల 26 లోపు ప్రధాన సమస్యలను పరిష్కరించకపోతే 27 నుంచి అన్ని జిల్లాలలో రిలే దీక్షలను చేపట్టేందుకు విద్యుత్తు ఉద్యోగ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి సిద్ధమవుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్ ఉద్యోగుల అవసరం ఎంతగానో ఉంది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గృహ, వ్యవసాయ రంగాలలో విద్యుత్ వాడకం పెరిగింది. కొత్తగా కనెక్షన్లు తీసుకుంటున్నారు. పంటల సాగుకు రైతులు వ్యవసాయ కనెక్షన్ల మంజూరుకు దరఖాస్తులు చేసుకొని బోర్లు, బావులకు మీటర్లను ఏర్పాటు చేయించుకుంటున్నారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నప్పటికీ విద్యుత్ ఉద్యోగులు ఆందోళనకు దిగితే సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు లేకపోలేదు. ఈ క్రమంలోనే ప్రభుత్వం స్పందించి సానుకూలంగా చర్చలు జరిపి సమస్యలు పరిష్కరిస్తే విద్యుత్ వినియోగదారులకు ఇబ్బంది లేకుండా పోతుంది. ఇప్పటికే సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రంలో గ్రామ పంచాయతీ వర్కర్లు ఆందోళనలు చేపట్టారు. ఉద్యోగ జేఏసీ నాయకులు సమరానికి సన్నద్ధమవుతున్నారు. వీరి బాటలోనే విద్యుత్ ఉద్యోగులు కూడా ఈనెల 27 నుంచి రిలే దీక్షలు చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఆర్టీసీ కార్మికులు కూడా సమ్మె చేసేందుకు సమాయత్తమవుతున్నారు. ఈనెల 25 నుంచి ప్రారంభించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించకపోతే వివిధ శాఖల ఉద్యోగులు పోరుబాట పట్టే అవకాశం ఉంది. తద్వారా ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయి. వెంటనే ప్రభుత్వం చొరవ చూపి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# మహబూబ్‌నగర్



# ప్రభుత్వ పాఠశాలల యూనిఫారాలపై హరీశ్‌రావు ధ్వజం

హైదరాబాద్ ఆగస్టు 23 : ( వార్తా వేదిక సూర్య )

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన యూనిఫారాలు కూడా అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. మాట్లాడితే ప్రపంచస్థాయి విద్యా వ్యవస్థను నిర్మిస్తున్నామని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీసం నాణ్యమైన యూనిఫారాలు ఇవ్వలేకపోతున్నారని ఆరోపించారు.

కొన్ని ప్రాంతాల్లో యూనిఫారాలు అందలేదని, అందిన చోట్ల కొలతలు సరిగ్గా లేవని హరీశ్‌రావు పేర్కొన్నారు. కుట్లు ఊడిపోతున్నాయని, ఉతికితే రంగులు వెలిసిపోతున్నాయని ఆరోపించారు. రెండు జతలు ఇవ్వాల్సి ఉండగా.. చాలా చోట్ల ఒక్క జత కూడా పూర్తిగా అందలేదన్నారు.

తెలంగాణ చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేలా స్థానికంగా యూనిఫారాల తయారీకి ప్రాధాన్యం ఇవ్వాల్సిన ప్రభుత్వం.. కమీషన్ల కోసం పెద్ద కార్పొరేట్ సంస్థల నుంచి నాసిరకం యూనిఫారాలు తెప్పించి విద్యార్థులకు, చేనేత కార్మికులకు అన్యాయం చేసిందని హరీశ్‌రావు ఆరోపించారు. రేవంత్‌రెడ్డికి గుజరాత్ దళారులపై ఉన్న ప్రేమ తెలంగాణ చేనేత కార్మికులపై లేదని విమర్శించారు.


'మఫత్‌లాల్ ముద్దు.. చేనేత వద్దు' అన్నదే ప్రభుత్వ వైఖరిగా మారిందా? అని ప్రశ్నించారు. ఒకవైపు చేనేత కార్మికుల ఉపాధికి గండి పడుతుండగా.. మరోవైపు విద్యార్థులకు నాసిరకం యూనిఫారాలు అందుతున్నాయని అన్నారు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు, చేనేత కార్మికులకు ఉపాధి నష్టం జరుగుతోందని పేర్కొన్నారు.

నాసిరకం యూనిఫారాలపై ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# సింగరేణి పరిరక్షణకు ఐక్య ఉద్యమం

### - ఎబీకేఎంఎస్ - బీఎంఎస్ జాతీయ కార్యదర్శి పి. మాధవ నాయక్

కొత్తగూడెం, ఆగస్టు 23 –( వార్తా వేదిక సూర్య ):



సింగరేణి సంస్థను పరిరక్షించడంతో పాటు కార్మికుల హక్కులు, ప్రయోజనాలను కాపాడేందుకు 12వ జాయింట్ బైపార్టైట్ కమిటీ ఫర్ ది కోల్ ఇండస్ట్రీ (జేబీసీసీఐ) వేతన సవరణ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని ఎబీకేఎంఎస్ – బీఎంఎస్ జాతీయ కార్యదర్శి పి. మాధవ నాయక్ డిమాండ్ చేశారు. ఈ అంశాలపై ఈ నెల 25న సాయంత్రం 5.30 గంటలకు కొత్తగూడెంలోని కే సీ ఓ ఎ క్లబ్‌లో ప్రత్యేక సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సంస్థలు ట్రాన్స్‌కో, జెన్‌కో నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిలు సకాలంలో అందకపోవడంతో సంస్థ రూ.50 వేల కోట్లకు పైగా బకాయిల భారంతో ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోందని మాధవ నాయక్ పేర్కొన్నారు. సింగరేణి ఆర్థికంగా బలహీనపడితే వేలాది కార్మిక కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడుతుందని, రాజకీయ జోక్యాలకు తావులేకుండా సంస్థకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించి ఆర్థికంగా బలోపేతం చేయాలని కోరారు. అలాగే 12వ వేతన సవరణ కమిటీ ఏర్పాటులో జరుగుతున్న జాప్యంపై కార్మికుల్లో ఆందోళన నెలకొందని, ఇకనైనా ఆలస్యం చేయకుండా కమిటీని ఏర్పాటు చేసి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి పరిరక్షణ, సంస్థ ఆర్థిక బలోపేతం, కార్మికుల హక్కుల పరిరక్షణ, 12వ వేతన సవరణ కమిటీ సాధన కోసం కార్మికులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు బిఎంఎస్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి రామ్మోహన్ ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, సింగరేణికి చెందిన ఎస్సి, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు ప్రత్యేక అతిథులుగా పాల్గొననున్నారు. కార్మికులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై సింగరేణి పరిరక్షణ కోసం తమ గళాన్ని వినిపించాలని మాధవ నాయక్ కోరారు.

# పెరుగుతున్న గుండెపోటు మరణాలు

### -ఆరోగ్యంగా ఉన్న యువతలో కూడా సడన్ హార్ట్ ఎటాక్..

### -కొన్ని అలవాట్లకు దూరంగా ఉండాలంటున్న నిపుణులు.

హైదరాబాద్ ఆగస్టు 23: ( వార్తా వేదిక సూర్య )

నేటి రోజుల్లో మారిన జీవనశైలి..ఆహారపు అలవాట్లు కారణంగా గుండెపోటు మరణాలు ఎక్కువ అయ్యాయని ని పుణులు చెబుతున్నారు.శారీరకంగా ఫిట్ గా ఉండి..హై బీపీ..డయాబెటిస్ వంటి సమస్యలు లేకపోయినా హఠా త్తుగా గుండె ఆగిపోయి చనిపోతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నట్లు వెల్లడిస్తున్నారు.మరి..ఈ సడన్ హార్ట్ ఎటాక్ కు కారణాలు? తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఈ స్టోరీలో తెలుసుకుందాం.

గుండె లయ తప్పటం :

గుండె కొట్టుకోవడానికి ప్రత్యేక విద్యుత్ వ్యవస్థ తోడ్పడుతుందని..ఇది అస్తవ్యస్తమైతే గుండె కొట్టుకునే తీరు దెబ్బ తింటుందని నిపుణులు చెబుతున్నారు.ఈ క్రమంలో గుండె..చాలా వేగంగా లేదా నెమ్మదిగా కొట్టుకోవచ్చని..కొన్ని సార్లు పూర్తిగా ఆగిపోవచ్చని పేర్కొంటున్నారు.గుండె స్పందనలో ముఖ్యమైనవి వెంట్రీ క్యూలర్ టేకీ కార్డియా..వెం ట్రీ క్యూలర్ ఫిబ్రిలేషన్..హఠాత్తుగా గుండె ఆగిపోవడానికి 99 శాతం వరకు కారణం ఇవే అంటున్నారు.వెంట్రీ క్యూ లర్ ఫిబ్రిలేషన్ లో గుండె కొట్టుకోవటమనేదే ఉండదని..విద్యుత్ వ్యవస్థలో షార్ట్ సర్క్యూట్ తలెత్తినట్లుగా గుండె ఆగిపోతుందని అంటున్నారు.ఇక టేకీ కార్డియాలో గుండె చాలా వేగంగా కొట్టుకుంటుందని..ఇది హఠాత్తు మరణా నికి దారి తీయదని..క్రమంగా వెంట్రీ క్యూలర్ ఫిబ్రిలేషన్ కు కారణమవుతుందని వివరిస్తున్నారు.

ఛాతి నొప్పితో :

రక్తనాళాలలో పూడికలు గుండె పోటుకు కారణం కావచ్చు అని..నిపుణులు అంటున్నారు.ఈ పూడికల వల్ల గుండె కు రక్త ప్రవాహం తగ్గుతుందని..దీంతో హార్ట్ ఎటాక్ సంభవిస్తుందని మయో క్లినిక్ ఓ అధ్యయనంలో పేర్కొంది.ఈ క్ర మంలో హార్ట్ ఎటాక్ తో చనిపోతున్న వారిలో 50 శాతం మరణాలకు కారణం ఇదే అని చెబుతున్నారు.ఇలాంటివా రు సాధారణంగా ఛాతి నొప్పి..అసౌకర్యం వంటి లక్షణాలు మొదలైన గంటలోపే కుప్పకూలుతున్నారని పేర్కొంటు న్నారు.



సరిగా పనిచేయకపోవడం వల్ల :

జన్యువులలో తేడాల వల్ల కొంతమందిలో కణస్థాయిలో సోడియం..పొటాషియం మార్గాలలో లోపాలు ఉంటాయ ని నిపుణులు చెబుతున్నారు.దీంతో గుండె విద్యుత్ వ్యవస్థ సరిగా పనిచేయక కుప్పకూలుతున్నారని వివరిస్తు న్నారు.గుండె విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తమయ్యే వారికి కొన్ని రకాల మందులు..ముఖ్యంగా యాంటీ హిస్ట మిను లు..అజిత్రోమైసిన్ వంటివి ప్రమాదకరంగా పరిగణించవచ్చని..ఇవి వెంట్రీ క్యూలర్ ఫిబ్రిలేషన్ ను ప్రేరేపిస్తాయని పే ర్కొంటున్నారు.

వైరల్ ఇన్ఫెక్షన్ ప్రభావం :

మయో కార్డిటిస్..అనే గుండె కండరాల వాపు వల్ల కూడా హఠాత్తుగా గుండెపోటు వస్తుందని నిపుణులు చెబుతు న్నారు.ఈ సమస్య వైరస్ ఇన్ఫెక్షన్ వల్ల వస్తుందని..కోవిడ్ 19 తర్వాత ఈ సమస్య ఎక్కువ అయినట్లు అనేక అ ధ్య యనాలలో వెల్లడైంది.ఇలాంటి వైరల్ ఇన్ఫెక్షన్లు గుండెను బలహీన పరుస్తాయని..దీంతో అరిత్మియాస్ కు దారి తీసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వివరిస్తున్నారు.

తీవ్ర వ్యాయామంతో :

ఇతర భాగాలలో ఏర్పడే రక్తం గడ్డలు..గుండె రక్తనాళాలకు చేరుకోవడంతోనూ హఠాత్తుగా గుండె ఆగిపోవచ్చు అని నిపుణులు అంటున్నారు.దీంతో పాటు రక్తంలో పొటాషియం..మెగ్నీషియం..వంటి ఖనిజ లవణాల మోతాదులు ప డిపోవటము కారణం కావచ్చు అని చెబుతున్నారు.అలాగే కొంత మంది తీవ్రమైన వ్యాయామం..శారీరక శ్రమ..ఆ టలతోనూ గుండె విద్యుత్ వ్యవస్థ విఫలం కావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఈ సమయంలో దాదాపు 16 గుండెపోటు అకస్మాత్తుగా సంభవిస్తుందని అమెరికా అధ్యాయంలో వెల్లడైంది.తీవ్ర మైన వ్యాయామం..హృదయ స్పందన రేటు..రక్తపోటు..అడ్రినలిన్ స్థాయిలను పెంచుతుందని..ఇది గుండెలో విద్యుత్ అవాంతరాలకు కారణ మవుతుందని ఇండియన్ ఇన్సూరెన్స్ షాప్ పబ్లిక్ హెల్త్ ఓ అధ్యయనములో పేర్కొంది.కానీ కొందరిలో అప్పటికే

ంశపారము..పర్యంగా గుండె కండరం మందం కావటం వంటి గుండె సమస్యలు ఉంటాయని..ఇలాంటివారు తీ వ్రమైన శ్రమ చేసినప్పుడు అడ్రినలిన్ హార్మోన్ విడుదలై..విద్యుత్ వ్యవస్థ మీద విపరీత ప్రభావం పడుతుందని..ఫ లితంగా హార్ట్ ఎటాక్ వస్తుందని అంటున్నారు.

ఇవి కారణాలే: అధిక కొవ్వు.. మైదా పదార్థాలు :

డీప్ ఫ్రై చేసిన ఫుడ్స్..కొవ్వు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు..మైదాతో చేసిన పదార్థాలు తినడం వల్ల రక్త నా ళాల్లో కొవ్వు పేరుకు పోతుందని..దీంతో గుండెకు రక్తం సరఫరా చేసే ధమనులు మూసుకుపోయి..గుండెపోటుకు దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు.

ఈ అలవాట్లతో :

ధూమపానం..అతి మద్యపానం గుండెకు మంచిది కాదని..అందరికీ తెలిసిన విషయమే.అయితే ఇవి గుండెపోటు రావడానికి ప్రధాన కారకాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.పొగ త్రాగడం..వల్ల రక్తనాళాలు దెబ్బతిని..రక్త ప్రసరణ ఆటంకాలు ఏర్పడతాయని పేర్కొంటున్నారు.అలాగే అధికంగా మద్యం సేవించడం కూడా గుండె ఆరోగ్యాన్ని ప్రభా వితం చేస్తుందంటున్నారు.అనారోగ్యకరమైన ఆహారము..పొగాకు వినియోగము..మద్యపానము..తక్కువ శారీరక శ్రమతో కూడిన జీవనశైలి..హృదయ సంబంధ వ్యాధులకు ప్రధాన పాత్ర పోషిస్తాయని నేషనల్ లేబరేటరీ ఆఫ్ మె డిసిన్ అధ్యయనములో తేలింది.

ఇవి కూడా ప్రమాదమే :

ఎక్కువ ఉప్పు తీసుకోవడం వల్ల..బీపీ పెరిగి గుండెపై భారం పడుతుందని నిపుణులు చెబుతున్నారు.అధిక చక్క ర..ప్రాసెస్ చేసిన ఆహార పదార్థములు ఎక్కువగా తీసుకోవడం కూడా..గుండెపోటు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉం టుందని వివరించారు.నిరంతర ఒత్తిడి..సరిపడ నిద్ర లేకపోవడం కూడా..గుండె సమస్యలకు దారి తీయవచ్చు అ ని పేర్కొంటున్నారు.

# కల్వకోల్ లో వీధి కుక్కల దాడి - 20 గొర్రెలు మృతి

**- జీవనాధారం కోల్పోయిన యాదవ కుటుంబం**

**ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు**

**మహేశ్వరం ఆగస్టు 23 వార్త వేదిక సూర్య :** మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆరడి చిన్న శంకరయ్య అనే గొర్రెల కాపరి కుటుంబం జీవనాధారమైన 20 గొర్రెలు ఆదివారం వీధి కుక్కల దాడిలో మృతి చెందాయి.

గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్న శంకరయ్య గొర్రెల కొట్టంలోకి ఒక్కసారిగా వీధి కుక్కల గుంపు దాడి చేయడంతో 20 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. పూర్తిగా గొర్రెలపైనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబం ఒక్కసారిగా రోడ్డున పడటంతో తీవ్ర ఆందోళనకు గురైంది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జీవనోపాధి



కోల్పోయిన ఆరడి చిన్న శంకరయ్య కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆమె కోరారు. ఈ



సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు బక్కని రవి మాదిగ మాట్లాడుతూ, నిరుపేద యాదవ కుటుంబానికి గొర్రెలే జీవనాధారం అని, వీధి కుక్కల దాడిలో 20 గొర్రెలు చనిపోవడం బాధాకరమని, ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# పలు వివాహ వేడుకల్లో వధూవరులను ఆశీర్వదించిన బీఆర్ఎస్ ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డి

**రాజేంద్రనగర్, ఆగస్టు 23 ( వార్త వేదిక సూర్య ) :**రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్‌తో కలిసి నియోజకవర్గంలోని పలు వివాహ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాము యాదవ్, అశోక్ కుమార్, చిరంజీవి, సునీల్, అనిల్, నాని, రాజు, వెంకటేష్, సెంట్రింగ్ అశోక్, సంతోష్, రిషి తదితరులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో అంబర్ నగర్ మహారాజా గణేష్ ఉత్సవాలకు ఏర్పాట్లు

**సికింద్రాబాద్, ఆగస్టు 23(వార్త వేదిక సూర్య)** అంబర్ నగర్‌లో మారుతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం సెప్టెంబర్ 06వ తేదీన ఆగమన్ సాయంత్రం 06 గంటల నుంచి 09 వరకు ఏకశిలా చౌరస్తా లో నిర్వహించబడును. ఈ రోజు ఎంవైఎ యూత్ గణేష్ పోస్టర్ ను యూత్ నిర్వాహకులు ఆవిష్కరించారు. సెప్టెంబర్ 14 నుంచి 25వ తేదీ వరకు గణేష్ నవరాత్రి ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా సెప్టెంబర్ 20న అన్నప్రసాద కార్యక్రమం, సెప్టెంబర్ 25న సాయంత్రం 6 గంటలకు లడ్డూ వేలం కార్యక్రమం నిర్వహించనున్నారు. అదే రోజు గణపతి నిమజ్జన కార్యక్రమం కూడా జరగనుంది. వారు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులను ఆకర్షించే విధంగా లాటరీ కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు. రూ.100 టికెట్‌తో నిర్వహించే లాటరీలో మొదటి బహుమతిగా 32 అంగుళాల టీవీ, రెండో బహుమతిగా గేర్ సైకిల్, మూడో బహుమతిగా ఎయిర్ ఫ్రయ్యర్ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపతి ఆశీస్సులు పొందాలని, ఉత్సవాలను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మారుతి యూత్ అసోసియేషన్ నిర్వాహకులు కోరారు.





## యాదాద్రి భువనగిరి

# ఎమ్మెల్యే సహకారంతో 8 లక్షల రూపాయల డ్రైనేజి పనులకు శంకుస్థాపన



**భువనగిరి టౌన్ ఆగస్ట్ 23, వార్త వేదిక సూర్య :**భువనగిరి పురపాలక 22వ వార్డు పరిధిలోని న్యూ రామ్ నగర్లో డ్రైనేజి మరియు సిసి రోడ్డు కొరకు నిధులు మంజూరు చేయాలనీ గతంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ని కోరగా హెచ్.ఎం.డి.ఏ నిధుల నుండి మంజూరు చేయడం జరిగింది.

దానికి సంబంధించిన ఆదివారం స్థానిక కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించడం జరిగింది. వార్డు ప్రజల తరపున ఎమ్మెల్యే కి ప్రత్యేక ధన్యవాదాలు తెలపడం జరిగింది.

ఈ కార్యక్రమంలో నాయకులు గాజుల వెంకట నర్సయ్య, తోట కార్తీక్, ప్రమోద్, మహేందర్, రాజేష్, కిషోర్ స్థానికులు సహదేవ్, కృష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు.

# వివాహ శుభకార్యక్రమాల్లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, ఆగస్టు 23 ( వార్త వేదిక సూర్య ) :**రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో జరిగిన పలు వివాహ శుభకార్యక్రమాలకు ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వధూవరులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ఆనందంగా జీవించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. వివాహ వేడుకల్లో కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పెద్దమ్మ గుడిలో ఘనంగా బోనాల పండుగ



**భువనగిరి టౌన్ ఆగస్ట్ 24, వార్త వేదిక సూర్య :** పెద్దమ్మ గుడిలో బోనాల పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా 33వ వార్డు కౌన్సిలర్ నాకోటి నగేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాకోటి నగేష్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రతి ఏటా భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. బోనాల సందర్భంగా మహిళా భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపల్ సిబ్బంది, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా భక్తులు, యువకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శంకుస్థాపన చేశారు.. వదిలేశారు

**మోత్కూరు, ఆగస్టు 23 ( వార్త వేదిక సూర్య):** మండలంలోని సదర్పాపురం నుంచి కొమ్మూరి బావి వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణం కోసం గత రెండేళ్ల క్రితం సిడిపి నిధుల నుంచి 4 లక్షల





రూపాయలు మంజూరయ్యాయి. ఈ రోడ్డు పనులను తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ 10బి03బి2024 న శంకుస్థాపన చేసినప్పటికీ నేటికీ పనులు ప్రారంభించకపోవడం వల్ల కొమ్మూరిబావి ప్రజలు రహదారి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు సుమారు 40 ఏళ్ల పైగా సదర్పాపురం గ్రామానికి అనుసంధానంగా ఏర్పడిన కొమ్మూరిబావికి నేటికి సరైన రహదారి లేక అష్టకష్టాలు పడుతున్నామని,ఆ గ్రామస్తులు తెలిపారు. ప్రతి అసెంబ్లీ ఎన్నికల ముందు తమకు రహదారి కల్పిస్తామని ఎమ్మెల్యే అభ్యర్థులు హామీలు ఇస్తున్నప్పటికీ నెరవేర్చటంలో పూర్తి విఫలమైయ్యారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రహదారి మరమ్మతులను వెంటనే చేపట్టాలని కోరుతున్నారు.

# పెండింగ్ పీఆర్సీ, డి ఏ ల బకాయిలను వెంటనే విడుదల చేయాలి



**యుటిఎఫ్ మండల అధ్యక్షులు వెంకన్న**

**మోత్కూరు, ,ఆగస్టు 23 (వార్త వేదిక సూర్య)::** ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ లో ఉన్న పీఆర్సీ, డి ఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ మండల అధ్యక్షులు దర్శనం వెంకన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఏడాదికాలంగా పెండింగ్ లో ఉన్న పిఆర్సీ, డిఏలు సకాలంలో రాకపోవడం వల్ల ఉపాధ్యాయులు త్రీవ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా .హెల్త్ కార్డుల నిర్వహణపై తక్షణమే మొదటి ట్రస్ట్ సమావేశం ఏర్పాటు చేసి,విధివిధానాలు ప్రకటించాలని కోరారు కస్తూర్బా ఉపాధ్యాయుల సమ్మె కాలపు వేతనాన్ని విడుదల చేయాలని, మోడల్ స్కూల్ సిబ్బందికి 010 పద్దు వర్తింపజేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 27న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ లకు వినతి పత్రాలను అందజేస్తున్నామని తెలిపారు. అప్పటికి ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్య పరిష్కరించకపోతే సెప్టెంబర్ 10న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ధర్నాకు రాష్ట్ర నలుమూలల నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# మృతుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శ

**మోత్కూరు/ అడ్డగూడూరు. ఆగస్టు 23 ( వార్త వేదిక సూర్య):** అడ్డగూడూరు మండలంలోని లక్ష్మీదేవి కాల్వ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వల్లంభట్ల వేణు, పొన్నాల వెంకన్న ఆజింపేట గ్రామానికి చెందిన పండుగ స్వామి ఇటీవల ఆకాల మృతి చెందారు. వారి అకాల మృతి పట్ల తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయా గ్రామాలకు వెళ్లి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, పొన్నాల వెంకన్న, పండగ స్వామి కుటుంబ సభ్యులకు 5000 రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మృతుల కుటుంబ కుటుంబ సభ్యులకు, కాంగ్రెస్ పార్టీ, తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి, టిపిసిసి రాష్ట్ర నాయకులు ఇటిక్యాల చిరంజీవి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలెంల విద్యాసాగర్, మాజీ ఎంపిటిసి బొమ్మగాని అంజమ్మ, మందుల వెంకటేష్ తదితరులు ఉన్నారు.



# ఘనంగా బోనాల పండుగ వేడుకలు





**మోత్కూరు, ఆగస్టు 23 (వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండగడపలో బోనాల పండుగ పురస్కరించుకొని ఆదివారం ఎడ్ల బండ్లు,బోనాలతో మారమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధమైన దుస్తులు ధరించి భక్తిశ్రద్ధలతో మారమ్మ తల్లికి బోనాలను సమర్పించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

# మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన వారి మిత్రులు

**రామన్నపేట ఆగస్టు 23 (వార్తా వేదిక సూర్య)** రామన్నపేట మండలం

ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన కడారి నరసింహ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం జరిగింది. వారి చిన్ననాటి స్నేహితులు( జూజ 1996-97) అందరూ కలిసి సహాయంగా 64,000 రూపాయలు ఈరోజు వారి కుటుంబ సభ్యులకు అందజేయడం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మిత్రులు తవటం పాండు, రవ్వ అశోక్ కుమార్ ,జిల్లాల శ్రీనివాస్, రాధారపు మల్లేశం, దొంత దామోదర్,మల్లెబోయిన గణేష్, చెవ్వ యాదగిరి,సింగన బోయిన దామోదర్, నల్ల రమేష్, నక్క వెంకటేశ్ పాల్గొన్నారు.



వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2, సంచిక : 96 || సోమవారం || ఆగస్టు, 24, 2026




# డీసీసీ అధ్యక్షుడి ఎంపికకు 'సంఘటన్ సృజన్ అభియాన్'

**- శంషాబాద్‌లో రాజేంద్రనగర్ నియోజకవర్గ స్థాయి సంస్థాగత సంప్రదింపుల సమావేశం**

**రాజేంద్రనగర్, ఆగస్టు 23 ( వార్త వేదిక సూర్య ) :**రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియలో భాగంగా ఏఐసీసీ సూచనల మేరకు 'సంఘటన్ సృజన్ అభియాన్' (ఎస్ ఎస్ ఎ ) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కర్ణాటక ఎమ్మెల్సీ, ఏఐసీసీ కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అబ్జర్వర్ పి.వి. మోహన్ తెలిపారు. శంషాబాద్ మండలం తండుపల్లి గ్రామంలోని మనస్వి గార్డెన్స్‌లో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో రాజేంద్ర నగర్ నియోజకవర్గ స్థాయి సంస్థాగత సంప్రదింపుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పి.వి. మోహన్ మాట్లాడుతూ.. బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే సంఘటన్ సృజన్ అభియాన్ ప్రధాన లక్ష్యమన్నారు. డీసీసీ నూతన అధ్యక్షుడి ఎంపికలో క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అందరినీ కలుపుకుని పార్టీని సమర్థవంతంగా ముందుకు నడిపించే నాయకత్వాన్ని పారదర్శకంగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో టీపీసీసీ అబ్జర్వర్లు, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న పలువురు నాయకులు సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలు, పార్టీ అభివృద్ధికి సంబంధించిన సూచనలు తెలియజేశారు. రాజేంద్రనగర్ నియోజక వర్గానికి చెందిన ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, జిల్లా కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# శ్రావణ మాసంలో భక్తిశ్రద్ధలతో కావడి యాత్ర

**- అత్తాపూర్ నుంచి రాంబాగ్ చిన్న అనంతగిరి శివాలయం వరకు ఘనంగా కావడి యాత్ర**




**రాజేంద్రనగర్, ఆగస్టు 23 ( వార్త వేదిక సూర్య ) :**అత్తాపూర్ అంబియన్స్ పోర్ట్ కాలనీ నుంచి శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో కావడి యాత్ర నిర్వహించారు. భక్తులు గంగా జలాన్ని తీసుకుని రాంబాగ్‌లోని శ్రీ చిన్న అనంతగిరి శివాలయానికి చేరుకుని పరమశివునికి అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల శివనామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు శుభాకాంక్షలు తెలిపారు. గంగా జలంతో పవిత్రంగా చేపట్టిన ఈ యాత్రలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మ్యాడం రామేశ్వర్ రావు, జిల్లా కార్యదర్శి సాబాద విజయ్ కుమార్‌తో పాటు ఎస్.బి. హరినాథ్, అరవింద్ అగర్వాల్, గణేష్ గుప్తా, దీపక్, ధర్మేంద్ర అగర్వాల్, ఓం ప్రకాష్, పంకజ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్సిపల్ కార్మికులపై దాడి చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**రాజేంద్రనగర్, ఆగస్టు 23 ( వార్త వేదిక సూర్య ) :**మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలిపురంలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులపై దాడి చేసిన వ్యక్తిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్మికులపై దాడి జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న జైపాల్‌రెడ్డి, అక్కడ ఉన్న కార్మికులను పరామర్శించి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై కార్మికులు కే. కృష్ణ, వి. అలువేలమ్మ, సి. వెంకటమ్మ, ఆర్. యాదమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతిరోజూ ఉదయం నుంచి విధులు నిర్వహించే పారిశుద్ధ్య కార్మికులపై దాడి చేయడం సరికాదన్నారు. పారిశుద్ధ్య పనుల విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయాలే తప్ప కార్మికులపై దాడి చేయకూడదన్నారు. విధుల్లో ఉన్న కార్మికులపై మద్యం మత్తులో దాడి చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐను కోరినట్లు తెలిపారు. పోలీసులు కూడా చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్లు జి. జాషువా, జె. మహేందర్, కే. సంగీత, వి. రాజు, కార్మికులు సబిత,



# ఏఐఎస్ఎఫ్ రాజేంద్రనగర్ మండల 10వ మహాసభ

**- విద్యా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలకు విద్యార్థులు సిద్ధం కావాలి**

**- ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి**

**రాజేంద్రనగర్, ఆగస్టు 23 ( వార్త వేదిక సూర్య ) :**ఏఐఎస్ఎఫ్ రాజేంద్రనగర్ మండల 10వ మహాసభను రాజేంద్రనగర్ సీపీఐ పార్టీ కార్యాలయం ఏఆర్ దేవరాజ్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి, మాజీ యువజన సంఘం నాయకులు కన్యగారి నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాసభకు ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించి మహాసభను ప్రారంభించారు. ఈ సందర్భంగా వంశీ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఏఐఎస్ఎఫ్‌కు దేశవ్యాప్తంగా గొప్ప పోరాట చరిత్ర ఉందన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు విద్యా రంగ పరిరక్షణ కోసం అనేక ఉద్యమాలు నిర్వహించిన ఘనత ఏఐఎస్ఎఫ్‌కు ఉందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాల వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావాల్సిన ప్రభుత్వాలు విద్యా రంగంలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. విద్యార్థులపై పెరుగుతున్న ఫీజుల భారాన్ని తగ్గించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులను మెరుగుపరిచి ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలను ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకోకుండా విద్యార్థి సంఘాలతో చర్చించి విధానాలను రూపొందించాలని అన్నారు. విద్యా రంగాన్ని కాపాడుకోవడానికి విద్యార్థులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మరింత విస్తృతమైన ఉద్యమాలు చేపడతామని, విద్యా వ్యతిరేక విధానాలను ఎక్కడికక్కడ ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు.

మహాసభలో రాజేంద్రనగర్ మండల పరిధిలోని విద్యార్థుల సమస్యలు, ఏఐఎస్ఎఫ్ భవిష్యత్ కార్యాచరణ, విద్యార్థులను ఉద్యమాల్లో మరింత భాగస్వామ్యం చేయడం తదితర అంశాలపై చర్చించారు. నూతన కమిటీ ఎన్నిక : అనంతరం ఏఐఎస్ఎఫ్ రాజేంద్రనగర్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా డి. శివ సాయి రామ్, అధ్యక్షురాలిగా కె. ప్రత్యూష, సహాయ కార్యదర్శులు గా జె. సాయి తేజ, డి. లక్ష్మీనారాయణ దత్తు, ఉపాధ్యక్షులుగా జె. రుత్విక్, ఎం. సాయి తేజ రావు, జి. నరోత్తం, సంయుక్త కార్యదర్శిగా డి. ప్రవీణ్ కుమార్‌తో పాటు మరికొంత మందిని నూతన మండల కౌన్సిల్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.







# నర్కూడలో శ్రీ వెంకటేశ్వర స్వామి పవిత్ర క్షేత్రంలో ప్రత్యేక పూజలు



**రాజేంద్రనగర్, ఆగస్టు 23 ( వార్త వేదిక సూర్య ) :** గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర గడ్డ--గుడిగడ్డను పూర్వీకులు పూజించిన అత్యంత పవిత్రమైన స్థలంగా భావిస్తారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆనవాళ్లు ఉన్న ఈ పవిత్ర ప్రదేశాన్ని బీజేపీ రాష్ట్ర నాయకులు బుక్క వేణుగోపాల్ పరిశీలించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్కూడ గ్రామ ప్రజలందరిపై శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. భక్తులు గోవింద నామస్మరణతో పూజలు నిర్వహించారు.




# వివాహ వేడుకల్లో పాల్గొన్న బుక్క వేణుగోపాల్



**రాజేంద్రనగర్, ఆగస్టు 23 ( వార్త వేదిక సూర్య ) :**రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని వివిధ వివాహ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర నాయకులు బుక్క వేణుగోపాల్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన దంపతుల వైవాహిక జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు.









Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305**, Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**